www.vishalabharati.com
epaper:vishalabharati.com

ఆదివారం, హైదరాబాద్
17.03.2024
సంపుటి:2 సంచిక:154

# విశాల భారతి

తెలుగు దిన పత్రిక



## ఇక వచ్చేవన్నీ పెద్ద ఇండ్లే...

నగరంలో పెరుగుతున్న ఇండ్ల విస్తీర్ణం ..మిగతా 3 లో

చిన్న ఇండ్ల కంటే పెద్ద ఇండ్లకే ప్రాధాన్యతనిస్తున్న బిల్డర్లు

గతేడాది కాలంగా పెరిగిన విశాలమైన ఇండ్ల క్రయవిక్రయాలు



## తెలంగాణలో బీజేపీ హవా

- కేంద్ర పథకాలు అందకుండా కాంగ్రెస్, బీఆర్ఎస్ అడ్డుకుంటున్నాయి
- ఎస్సీ వర్గానికి చెందిన డిప్యూటీ సీఎంను కింద కూర్చెబెడతారా?
- 80 లక్షల మందికి ఆయుష్మాన్ భారత్
- నేను పగలూ, రాత్రి దేశం కోసమే కష్టపడుతున్నా: మోదీ

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

వచ్చే పార్లమెంట్ ఎన్నికల కోసం ఢిల్లీలో ఎన్నికల కమిషన్ షెడ్యూల్ ప్రకటించకముందే దేశ ప్రజలు తీర్పు ఇచ్చేశారని, మూడోసారి మోదీయే ప్రధాని అని నిర్ణయించారని ప్రధాని అన్నారు. శనివారం నాగర్‌కర్నూల్ బీజేపీ విజయసంకల్ప సభలో మోదీ ప్రసంగించారు. నా తెలంగాణ కుటుంబ సభ్యులందరికీ నమస్కారాలు అని మోదీ తెలుగులో ప్రసంగం ప్రారంభించారు. తెలంగాణ ప్రజలు కూడా ఈసారి పార్లమెంట్ ఎన్నికల్లో చార్‌సౌ పార్(నాలుగు వందలు దాటి) అని నినదిస్తున్నారన్నారు. సభలో మోదీ మాట్లాడుతూ ' నిన్న(మార్చ్ 15) మల్కాజ్‌గిరి రోడ్ షోలో నిన్న జన ప్రవాహాన్ని చూశాను. యువకులు, మహిళలు, వృద్ధులు చాలా మంది రోడ్ల మీద నిల్చొని బీజేపీకి మద్దతు తెలిపారు. మల్కాజ్‌గిరిలో అద్భుతం జరిగింది. అసెంబ్లీ ఎన్నికలపుడు బీఆర్ఎస్ మీద ప్రజల్లో ఎంత వ్యతిరేకత ఉందో చూశాను. మోదీని మూడోసారి ప్రధాని చేయడానికి ఇప్పుడు అంతే ఉత్సాహంతో వేచి చూస్తున్నారు. గత పదేళ్లలో కేంద్ర పథకాలు తెలంగాణ ప్రజలకు చేరకుండా అవినీతి, అబద్ధాల కాంగ్రెస్, బీఆర్ఎస్ అడ్డుకున్నాయి. ఎన్నికల్లో గతంలో కాంగ్రెస్ అంబేద్కర్‌ను ఓడించింది. గిరిజన రాష్ట్రపతి ద్రౌపది ముర్ముని ఓడించాలని చూశారు. కాంగ్రెస్ తెలంగాణలో ఎస్సీ వర్గానికి చెందిన ప్రస్తుత డిప్యూటీ సీఎంను కూడా ఇప్పుడు అవమానిస్తోంది. కాంగ్రెస్ నేతలు పైన కూర్చుంటారు. ఎస్సీ వర్గానికి చెందిన డిప్యూటీ సీఎంను కింద కూర్చోబెడతారు. బీఆర్ఎస్ కూడా కాంగ్రెస్ బాటలో వెళ్లే పార్టీనే. తెలంగాణను గేట్ వే ఆఫ్ సౌత్ అని

..మిగతా 2 లో



## మోగిన ఎన్నికల నగారా

### తెలంగాణలో లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ రిలీజ్



- 17 ఎంపీ, 1 ఎమ్మెల్యే స్థానానికి మే 13న ఎన్నికలు
- జూన్ 4న లెక్కింపు , ఏపీలోనూ మే 13న ఎన్నికలు
- కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ రాజీవ్ కుమార్

**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:**

సార్వత్రిక ఎన్నికలకు నగారా మోగింది. ఢిల్లీలో కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ రాజీవ్‌కుమార్ లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించారు. రాష్ట్రంలో 17 ఎంపీ స్థానాలతో పాటు ఇటీవల లాస్య నందిత మృతితో ఖాళీ అయిన కంటోన్మెంట్ ఎమ్మెల్యే స్థానానికి మే 13న ఎన్నికలు జరగనున్నాయి. జూన్ 4న లెక్కింపు చేపట్టనున్నారు. మరోవైపు 18వ లోక్‌సభతో పాటు ఆంధ్రప్రదేశ్, ఒడిశా, సిక్కిం, అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల తేదీలనూ సీఈసీ వెల్లడించారు. ఏపీలోనూ మే 13న ఎన్నికల పోలింగ్ జరగనుండగా, జూన్ 4న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. అంతకుముందు ఎన్నికల షెడ్యూల్ విడుదల సందర్భంగా మాట్లాడిన ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్‌కుమార్, దేశ పౌరులంతా ఓటు హక్కు వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. 2024లో ప్రపంచ వ్యాప్తంగా అనేక చోట్ల ఎన్నికలు జరుగుతున్నాయని, ఈ సంవత్సరాన్ని ఎలక్షన్స్ ఇయర్‌గా చెప్పుకోవచ్చని అభివర్ణించారు. ఈ క్రమంలోనే ప్రపంచమంతా భారత ఎన్నికల వైపు చూస్తోందని పేర్కొన్నారు. భారత ప్రజాస్వామ్యబద్ధమైన ఎన్నికలను ప్రపంచం గమనిస్తోందన్నారు. స్వచ్ఛమైన ప్రజాస్వామ్యం నెలకొన్న భారతదేశం, ఎలా ఓటు చేస్తుందన్నది ప్రపంచం గమనిస్తోందని తెలిపారు.

ఈ సందర్భంగా ప్రతి ఎన్నిక ఎన్నికల సంఘానికి ఒక పరీక్షే అని రాజీవ్ కుమార్ పేర్కొన్నారు. ప్రతి పరీక్షలోనూ విజయం సాధించాలనేదే

..మిగతా 2 లో

**నామినేషన్లకు చివరి తేది**
ఏప్రిల్ 25

**నామినేషన్ల స్క్రూటినీ**
ఏప్రిల్ 26

**నామినేషన్ల ఉపసంహరణ**
ఏప్రిల్ 29

ఎన్నికలు జరిగే తేది తెలంగాణ, ఏపీ లో మే 13న

**ఎన్నికల ఫలితాలు-జూన్ 4**

- మొత్తం ఓటర్ల సంఖ్య 97 కోట్లు
- పురుషులు 49.7 కోట్ల మంది
- మహిళలు 47.1 కోట్ల మంది
- దివ్యాంగులు 88.4 లక్షల మంది
- ట్రాన్స్ జెండర్లు 48 వేల మంది
- 100 ఏండ్లు పైబడినవారు 2.18 లక్షల మంది
- 85 ఏండ్లు పై బడినవారు 22 లక్షలమంది
- 20-19 మధ్య వయసువారు -19.74 లక్షలమంది
- ఫస్ట్‌టైం ఓటర్లు 1.82 కోట్లు



## ధర్నాలు వద్దన్నోళ్లే అడ్డుకోవడం బాధాకరం

- చంద్రబాబు అరెస్టును గుర్తుచేసిన మంత్రి వెంకట్‌రెడ్డి
- కవిత అరెస్ట్ పై మంత్రి కోమటిరెడ్డి ఫైర్
- సవాల్‌చేసినోళ్లే సామాన్య కార్యకర్తలవుతున్నరు

**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:**

బీఆర్ఎస్ నాయకురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట కవిత అరెస్టును నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా శనివారం అనేక చోట్ల ఆందోళనలు కొనసాగాయి. రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో బీఆర్ఎస్ నేతలు ధర్నాలు రాస్తారోకోలు నిర్వహించి నిరసనను వ్యక్తం చేశారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ నేతలపై రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. నేడు కవిత కోసం జరుగుతున్న ఆందోళనలపై స్పందించిన ఆయన అసలు ఢిల్లీ లిక్కర్

..మిగతా 2 లో

## బీఎస్పీకి ఆర్ఎస్పీ రాజీనామా

- బరువైన గుండెతో పార్టీకి రాజీనామా చేస్తున్నా..
- కొత్తదారి ఎంచుకోవాల్సిన టైం వచ్చిందని వెల్లడి
- అందరితో చర్చించాక రాజకీయ భవిష్యత్‌పై నిర్ణయం
- సోషల్ మీడియా 'ఎక్స్' వేదికగా ప్రకటన

**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:**



బహుజన్ సమాజ్ పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆ పార్టీకి రాజీనామా చేశారు. ఈ మేరకు సోషల్ మీడియా ఎక్స్ వేదికగా వెల్లడించారు. ఈ సందర్భంగా కొత్తదారి ఎంచుకోవాల్సిన సమయం వచ్చిందని, పార్టీని వీడటం తప్ప మరో అవకాశం లేకుండాపోయిందని పేర్కొన్నారు. రాజీనామా తప్ప తనకు మరో మార్గం కనిపించలేదని చెప్పుకొచ్చారు. బరువైన గుండెతో బహుజన సమాజ్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. ఇటీవలి నిర్ణయాలు పార్టీ ప్రతిష్ఠకు నష్టం కలిగించకూడదనే ఈ నిర్ణయం తీసుకున్నానని వివరించారు. "పొత్తు ఒప్పందంలో భాగంగా ఎన్ని ఒడుదొడుకులు వచ్చినా ముందుకు సాగాల్సిందే. ఇదే నేను నమ్మిన నిజమైన ధర్మం. మా పొత్తు గురించి వార్త బయటకు వచ్చిన వెంటనే బీజేపీ దాన్ని భగ్నం చేయాలని విశ్వప్రయత్నాలు (ఎమ్మెల్సీ కవిత అరెస్టుతో సహా) చేస్తోంది. ఈ కుట్రలకు భయపడి నేను నమ్ముకున్న విలువలకు తిలోదకాలు ఇవ్వలేను. నా ప్రస్థానాన్ని ఆపలేను. చివరి వరకు బహుజనవాదాన్ని నా గుండెల్లో పదిలంగా దాచుకుంటా" అని ప్రవీణ్ కుమార్ తన ట్వీట్లో రాసుకొచ్చారు. తెలంగాణలో భవిష్యత్ కార్యాచరణపై నిర్ణయం తీసుకోవాల్సిన బాధ్యత ఇక

..మిగతా 2 లో

## 'మార్పు కావాలి.. కాంగ్రెస్ రావాలి'

- అదే నినాదంతో ప్రజల వద్దకు వెళ్లాలి
- కవిత అరెస్టు ఓ ఎన్నికల స్టంట్
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కామెంట్స్



**విశాల భారతి, స్టేట్ బ్యూరో:**

'మార్పు కావాలి.. కాంగ్రెస్ రావాలి' అనే నినాదంతో ప్రజల వద్దకు వెళ్లామని.. ప్రస్తుతం తాము ప్రజల్లోనే ఉన్నామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ప్రజాపాలనకు రేపటితో వంద రోజులు పూర్తికానున్న నేపథ్యంలో మంత్రులతో కలిసి శనివారం సీఎం మీడియాతో మాట్లాడారు. "గత పదేళ్ల పాలనలో వందేండ్లకు సరిపడా కేసీఆర్ ప్రభుత్వం విధ్వంసం చేసింది. రాష్ట్రాన్ని పూర్తిగా అప్పుల ఊబిలోకి దింపింది. గతంలో సీఎం దర్శనమే భాగ్యం అన్నట్లు ఉండేది. మా వంద రోజుల పాలన సంపూర్ణ సంతృప్తినిచ్చింది. అధికారం చేపట్టిన 24 గంటల్లోనే తొలి హామీ అమలు చేశాం. మహిళలు ఉచిత బస్సు ప్రయాణాన్ని వినియోగించుకుంటున్నారు. ప్రతి నియోజకవర్గంలో 3, 500 ఇళ్ల పథకాన్ని ప్రారంభించాం. 3 నెలల్లో 30 వేల ఉద్యోగాలు ఇచ్చి చరిత్ర సృష్టించాం. గత బీఆర్ఎస్‌ప్రభుత్వం టీఎస్‌పీఎస్‌సీని అవినీతికి అడ్డాగా మార్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ప్రక్షాళన చేపట్టాం. ఉచిత విద్యుత్ హామీ అమలులో భాగంగా 38 లక్షల జీరో బిల్లులు

..మిగతా 2 లో



## ఈడీ కస్టడీకి కవిత

- అనుమతించిన రౌస్ ఎవెన్యూ కోర్టు
- 23 వరకు ఈడీ కస్టడీలోనే బీఆర్ఎస్ ఎమ్మెల్సీ
- కుటుంబసభ్యులను కలిసేందుకు పర్మిషన్
- ఇంటినుంచి ఫుడ్ తెచ్చుకొనేందుకు ఓకే

**విశాల భారతి,స్టేట్ బ్యూరో:**

ఢిల్లీ లిక్కర్ స్కాంలో మనీ లాండరింగ్ ఆరోపణలతో అరెస్టైన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు షాక్ తగిలింది. కవితను ఈడీ కస్టడీకి అనుమతిస్తూ రౌస్ ఎవెన్యూ సీబీఐ ప్రత్యేక కోర్టు తీర్పు ఇచ్చింది. ఈ నెల 23 వరకూ ఆమెకు కస్టడీ విధించారు. శుక్రవారం సాయంత్రం ఆమె ఇంట్లో సోదాలు నిర్వహించిన ఈడీ అధికారులు అనంతరం ఆమెను అరెస్ట్ చేశారు. రాత్రి ఢిల్లీలోని ఈడీ కార్యాలయానికి తరలించారు. శనివారం ఉదయం వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం ఆమెను రౌస్ అవెన్యూ కోర్టులో హాజరుపరిచారు. ఇరువర్గాల వాదనలు విన్న న్యాయస్థానం.. ఈ నెల 23 వరకూ కవితను ఈడీ కస్టడీకి అనుమతించింది. ఈ మేరకు న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు. ప్రతీ రోజూ కుటుంబ సభ్యులు, న్యాయవాదులను కలిసేందుకు.. ఇంటి నుంచి తెచ్చిన ఆహారం తీసుకునేందుకు కూడా కోర్టు అనుమతించింది. ఈ నెల 23న మధ్యాహ్నం కోర్టులో హాజరు

..మిగతా 2 లో



## లిక్కర్ స్కామ్ కేసులో కేజ్రీవాలుకు బెయిల్

- ఈడీ ఎనిమిది సార్లు సమన్లు జారీ చేసినా ఢిల్లీ సీఎం గైర్హాజరు

**విశాలభారతి,నేషనల్ బ్యూరో:**

ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ కేసుకు సంబంధించి ఢిల్లీ సీఎం 'అరవింద్ కేజ్రీవాల్'కు రూ.15,000 బెయిల్ బాండ్, రూ.లక్ష పూచీకత్తుపై ఢిల్లీలోని రూస్ అవెన్యూ కోర్టు శనివారం బెయిల్ మంజూరు చేసింది. ఈడీ ఎనిమిది సార్లు సమన్లు జారీ చేసినప్పటికీ విచారణకు హాజరు కాకపోవడంతో.. దర్యాప్తు సంస్థ ఢిల్లీ కోర్టు మెట్లెక్కింది. కోర్టుకు హాజరైన సీఎం అరవింద్ కేజ్రీవాల్‌కు న్యాయస్థానం షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. న్యాయస్థానం తనకు బెయిల్ మంజూరు చేసిన తరువాత న్యాయమూర్తి అనుమతితో కోర్టు నుంచి కేజ్రీవాల్ వెళ్లిపోయారు. ఢిల్లీ ఇప్పుడు రద్దు చేసిన ఎక్సైజ్ పాలసీకి సంబంధించి మనీలాండరింగ్ కేసులో ఆప్ అగ్రనేతలు.. ఢిల్లీ మాజీ ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియా, రాజ్యసభ ఎంపీ సంజయ్ సింగ్‌లను ఈడీ అరెస్టు చేసింది. ఈడీ చార్జ్ షీట్లలో కేజ్రీవాల్ పేరు పలుమార్లు చోటు చేసుకుంది. ఎక్సైజ్ పాలసీ ముసాయిదా రూపకల్పన సమయంలో ఈ కేసులో నిందితులు ముఖ్యమంత్రితో టచ్‌లో ఉన్నారని ఏజెన్సీ తెలిపింది

## ఎంపీ అభ్యర్థికి ఎంత కష్టం!

- మరో రెండు నెలలు ఎన్నికల ప్రచారం
- పోటీ చేసేవారి ఓపికకే టైమ్ బాండ్ సవాల్
- ఓటర్ల చుట్టూ తిరగాలి.. చేతులెత్తి మొక్కాలి
- మే 13 దాకా కంటికి రెప్పలా కాపాడుకోవాలి
- నోట్ల కట్టలు పెంచాలి.. ఎక్కువగా పంచాలి
- రెండు రాష్ట్రాల్లో కాబోయే ఎంపీలకు పరీక్ష



**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:**

అయ్యో ఎంత పని అయ్యింది..! మార్చి ఆఖర్లో నోటిఫికేషన్, ఏప్రిల్ సెకండ్‌వీక్‌లో ఎలక్షన్లు అని లెక్కలేసుకుని సంకలెగరేసిన లీడర్లంతా అబ్బా ఎంత దెబ్బ అంటున్నారు. ప్లీజ్‌మరో రెండు నెలలు వేచి చూడండి.. అంటూ ఈసీ చెప్పిన చల్లటి కబురు.. అభ్యర్థుల్ని కుళ్లబొడుస్తోంది. ఇంటికెళ్లి సౌండ్ రాకుండా కుమిలి కుమిలి ఏడుస్తున్నారు బడా నేతలు. 'మే 13న ఎన్నికలు.. జూన్ 4న కౌంటింగ్' అని ఎలక్షన్ షెడ్యూల్ వచ్చీ రాగానే తెలుగు రాష్ట్రాల్లో మిక్స్‌డ్ ఫీలింగ్స్. మొదట్లో ఎగిరి గంతులేశారు లీడర్లు. ఎన్నాళ్లో వేచిన ఉదయం ఈనాడే వచ్చెనుగా అంటూ ఆ కాసేపూ సంబరాలూ చేసుకున్నారు. ఆ తర్వాతే.. ఒకరి మొహాలొకరు చూసుకుని తెల్లమొహాలేశారు. కారణం పోలింగ్ కోసం మరో 56 రోజుల సుదీర్ఘకాలం వెయిట్ చెయ్యాల్సి రావడం. ఏదేమైనా నేటితో షురూ చేస్తే.. దాదాపు 2 నెలల పాటు ఓటర్ల చుట్టూ చక్కర్లు కొట్టి తీరాలి. కనపడిన చోటల్లా చేతులెత్తి మొక్కాలి. అదొక తియ్యటి నరకం .. ఎవ్వరికీ చెప్పుకోలేని కష్టం.నిన్న మొన్నటిదాకా టికెట్

..మిగతా 2 లో

# మోగిన ఎన్నికల నగారా

**మొదటిపేజీ తరువాయి**

ఈసీ లక్ష్యమని స్పష్టం చేశారు. దేశమంతా పర్యటించి ఉన్నతాధికారులతో సమావేశాలు నిర్వహించామన్న ఆయన, ప్రతి అంచెలోనూ తమకు సంపూర్ణ విశ్వాసం ఉందన్నారు. ఈ క్రమంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్యమైన భారత్‌లో ఎన్నికలకు సౌకర్యాల కల్పన పెద్ద సవాల్ అన్న ఆయన, దేశవ్యాప్తంగా 97 కోట్ల మంది ఓటు వేసేలా ఏర్పాట్లు చేశామని వివరించారు. ఈ ఎన్నికల్లో 55 లక్షల ఈవీఎంలు వినియోగించనున్నట్లు తెలిపారు. 1.25 కోట్ల మంది సిబ్బందితో ఎలాంటి లోపం లేకుండా ఎన్నికలు నిర్వహిస్తామని విశ్వాసం వ్యక్తం చేశారు. 'దేశంలో మొత్తం ఓటర్లు 96.8 కోట్లు. పురుష ఓటర్లు 49.7 కోట్లు. మహిళా ఓటర్లు 47.1 కోట్లు. తొలిసారి ఓటు వేయనున్న యువత 1.85 కోట్లు. 48 వేల మంది ట్రాన్స్‌జెండర్లు, 88.4 లక్షల మంది దివ్యాంగులు. 12 రాష్ట్రాల్లో పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లే ఎక్కువ. పోటీ చేస్తున్న అభ్యర్థుల పూర్తి వివరాలు కేవైసీ యాప్‌లో చూడవచ్చు. అభ్యర్థి పూర్తి వివరాలను ప్రతి ఓటరూ తెలుసుకోవచ్చు. అభ్యర్థిపై ఉన్న క్రిమినల్ కేసులు, ఆస్తులు, అప్పుల వివరాలు యాప్‌లో ఉంటాయి. తాయిలాలు, నగదు పంపిణీ జరిగితే ఫొటో తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయండి. మీ సెల్‌ఫోన్ లొకేషన్‌ను బట్టి మీ ప్రాంతానికి 100 నిమిషాల్లో చేరుకుంటాం.' అని రాజీవ్ కుమార్ స్పష్టం చేశారు.

# ఈడీ కస్టడీకి కవిత



**మొదటిపేజీ తరువాయి**

పరచాలని ఆదేశాలిచ్చింది. కవిత తరఫున సీనియర్ న్యాయవాదులు విక్రమ్ చౌదరి, మోహిత్ రావులు వాదనలు వినిపించగా.. ఈడీ తరఫున జోయబ్ హుస్సేన్, ఎన్.కే మట్టా వాదనలు వినిపించారు.

**రిమాండ్ రిపోర్టులో ఏముందంటే.?**

కవిత రిమాండ్ రిపోర్టులో ఈడీ కీలక విషయాలు వెల్లడించింది. 'ఢిల్లీ లిక్కర్ స్కాంలో సౌత్ లాబీ పేరుతో కవిత కీలకంగా వ్యవహరించారు. లిక్కర్ విధానంలో ఆమెనే ప్రధాన లబ్ధిదారు. ఆప్ పార్టీకి రూ.100 కోట్లు ఇవ్వడంలో కవిత కీలక సూత్రధారి. మాగుంట శ్రీనివాస్ రెడ్డితో కలిసి ఆప్ నేతలతో ఆమె కుట్రకు పాల్పడ్డారు. కవితకు బినామీగా రామచంద్ర పిళ్లై ఉన్నారు. ఆయన ద్వారానే ఆమె మొత్తం వ్యవహారం నడిపించారు. అరుణ్ పిళ్లైని డమ్మీగా పెట్టి ఇండోస్పిరిట్ కంపెనీలో కవిత వాటా పొందారు. ఇతరులతో కలిసి రూ.100 కోట్ల లంచాలను ఆప్ నేతలకు ఆమె ఇచ్చారు. తన మొబైల్ లోని ఆధారాలు తొలగించారు. సౌత్ గ్రూప్ లోని శరత్ చంద్రారెడ్డి, మాగుంట శ్రీనివాస్ రెడ్డి, రాఘవ మాగుంటతో కలిసి ఆప్ నేతలతో కవిత కుట్రలు పన్నారు. మాగుంట ద్వారా రూ.30 కోట్లను ఢిల్లీకి చేర్చారు. ఈ సొమ్మును అభిషేక్ బోయినపల్లి ఢిల్లీకి తీసుకెళ్లాడు.' అంటూ ఈడీ పేర్కొంది.

అటు, ఈ కేసులో తనను కావాలనే ఇరికించారని కవిత అన్నారు. శనివారం ఉదయం కోర్టుకు తీసుకెళ్తున్న సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడారు. 'ఈడీ నన్ను చట్ట విరుద్ధంగా అరెస్ట్ చేసింది. లిక్కర్ కేసు ఓ కట్టుకథ. అక్రమ అరెస్టుపై న్యాయ పోరాటం చేస్తాను.' అని పేర్కొన్నారు. తనను శుక్రవారం నుంచి న్యాయవాదులతో మాట్లాడనివ్వలేదని.. మధ్యాహ్నం 2 గంటలకు తీసుకొస్తామని 11 గంటలకు తీసుకొచ్చారని అన్నారు. ఈడీ అధికారులు అధికార దుర్వినియోగం చేశారని కవిత తరఫు లాయర్లు వాదించారు. సెప్టెంబర్ 15న సుప్రీం కోర్టులో ఇచ్చిన మాటను ఉల్లంఘించారని.. తదుపరి విచారణ జరిగే వరకూ ఎలాంటి చర్యలు తీసుకోమని చెప్పారని గుర్తు చేశారు. కానీ అలా జరగలేదని.. మహిళను ఈడీ కోర్టుకు పిలవడంపై కేసు పెండింగ్ లో ఉందని పేర్కొన్నారు. ఓపెన్ కోర్టులో ఇచ్చిన స్టేట్మెంట్ కు ఈడీ కట్టుబడి లేదంటూ కోర్టుకు తెలిపారు. ఇరు వర్గాల సుదీర్ఘ వాదనలు విన్న న్యాయస్థానం కవితను ఈడీ కస్టడీకి అప్పగిస్తూ ఆదేశాలిచ్చింది.

# తెలంగాణలో బీజేపీ హవా

**మొదటిపేజీ తరువాయి**

పిలుస్తారు. గత పదేళ్లలో తెలంగాణ అభివృద్ధి మోదీ ప్రభుత్వ ప్రాధాన్యతగా ఉంది. కానీ పదేళ్లలో తెలంగాణ కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య నలిగిపోయింది. కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి తెలంగాణ ప్రజల కలలను చిన్నాభిన్నం చేశారు. ఇక్కడి నుంచి బీజేపీ ఎంపీలు గెలిస్తే రానున్న రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వ ఆటలు సాగవు. ఇందుకే ఇక్కడ బీజేపీ ఎంపీలు గెలవాల్సి ఉంది. తెలంగాణ నుంచి ఎక్కువ మంది ఎంపీలుంటే నేను మీకు చాలా సేవ చేయడానికి వీలవుతుంది. ఎక్కువ మంది ఎంపీలు గెలిస్తే మీ ఆకాంక్ష ఢిల్లీలో నాకు తెలుస్తుంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ ఓట్లు రెండింతలు చేశారు. ఈసారి బీజేపీకి రెండంకెల ఎంపీ సీట్లివ్వండి. నా ప్రసంగాలు ఎక్స్(ట్విటర్)లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) సాయంతో తెలుగులో వినండి. కేసీఆర్ రాజ్యాంగాన్ని మార్చాలంటున్నాడు. అంబేద్కర్‌ను అవమానిస్తున్నాడు. దళితబంధుతో కేసీఆర్ దళితులను మోసం చేశాడు. బీఆర్ఎస్ దళితున్ని సీఎం చేస్తానని చేయలేదు. కుటుంబ పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్ స్కాముల్లో భాగస్వాములు, కాంగ్రెస్ 2జీ కుంభకోణం చేస్తే బీఆర్ఎస్ నీటి పారుదల ప్రాజెక్టులో అవినీతి చేసింది. రాష్ట్రం బయటికి వెళ్లి అవినీతి పార్టీలతో కలిసి అవినీతి చేశారు. ఈ నిజాలు రోజు మన ముందు బయటపడుతూనే ఉన్నాయి. మోదీ మీ దగ్గర ఓటు తీసుకుని కుటుంబ సభ్యులకు కుర్చీ ఇవ్వడు. వారి బ్యాంకు బ్యాలెన్సులు పెంచడు. 140 కోట్ల మంది మోదీ కుటుంబ సభ్యులే. మోదీ కుర్చీలో కూర్చొని సుఖ పడడు. చాలా కాలం సీఎంగా, ఇప్పుడు పీఎంగా నాకు సేవ చేసే అవకాశమిచ్చారు. ఇన్నేళ్లలో ఒక్కరోజు కూడా నేను నా కోసం వాడుకోలేదు. నేను ఏమైనా చేశానంటే, రాత్రి పగలు కష్టపడ్డానంటే 140 కోట్ల మంది ప్రజల కోసమే. ఇందుకే మోదీ గ్యారెంటీ అంటే గ్యారెంటీ పూర్తి చేసే గ్యారెంటీ. ఆర్టికల్ 370 రద్దు చేస్తామంటే చేశాం. రాముడు సొంతింటికి వస్తాడని చెప్పాం. వచ్చాడు. దేశ ఆర్థిక వ్యవస్థను ప్రపంచంలో అగ్రభాగంలో నిలిపాం. ఇది మోదీ గ్యారెంటీ. తెలంగాణలో పేదల కోసం ఒక కోటి బ్యాంకు ఖాతాలు తెరిచాం. తెలంగాణలో 1 కోటి 50 లక్షల మందికి బీమా చేశాం. తెలంగాణలో 67 లక్షల కంటే చిన్న వ్యాపారులకు ముద్ర రుణాలు వచ్చాయి. 80 లక్షల కంటే ఎక్కువ మందికి ఆయుష్మాన్ భారత్ లబ్ధి చేకూరింది. తెలంగాణ ప్రజలకు నేను మాటిస్తున్నాను. ఒక్క అవినీతి పరున్ని వదలను. అవినీతిపై పోరాడేందుకు నాకు ఆశీర్వాదం ఇవ్వండి. నాగర్‌కర్నూల్, సికింద్రాబాద్, మహబూబ్‌నగర్, నల్గొండ పార్లమెంట్ నియోజకవర్గాల్లో బీజేపీ ఎంపీ అభ్యర్థులను గెలిపించండి' అని మోదీ విజ్ఞప్తి చేశారు. ఈ సభలో కేంద్రమంత్రి, బీజేపీ తెలంగాణ చీఫ్ కిషన్‌రెడ్డి, నాగర్‌కర్నూల్, నల్గొండ, సికింద్రాబాద్, మహబూబ్‌నగర్ నియోజకవర్గాల నుంచి పోటీ చేస్తున్న బీజేపీ అభ్యర్థులు పాల్గొన్నారు.

# తప్పు చేస్తే సీఎం అయినా జైలుకే..

- 'ఆప్' సగం మంది మంత్రులు జైలుకు వెళ్లారు
- ఇప్పుడు కవిత కూడా వెళ్లింది.. ఆధారాలతోనే అరెస్టు
- దీన్ని హరీశ్ రావు బీజేపీకి అంటగడుతున్నారు
- మీరు తప్పు చేయకుంటే న్యాయస్థానాన్ని ఆశ్రయించండి
- రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్



**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:**

తప్పు చేసిన వారు ముఖ్యమంత్రి అయినా, ఆయన బంధువులైనా, కుటుంబ సభ్యులైనా శిక్షార్హులేనని, జైలుకు పోవాల్సిందేనని, తప్పు చేసిన ఎవరినీ వదిలే ప్రసక్తి చట్టానికి లేదని రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్ అన్నారు. హైదరాబాద్ లో శనివారం ఆయన కవిత అరెస్టుపై స్పందించారు. ఈసందర్భంగా పలు వ్యాఖ్యలు చేశారు. మద్యం కుంభకోణంలో కవితను అరెస్ట్ చేశారని ఆయన చెప్పారు. సంవత్సర కాలంగా దర్యాప్తు సంస్థలు అనేక ఆధారాలు సేకరించి అరెస్ట్ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఢిల్లీలోని ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వంలో కూడా సగం మంది మంత్రులు ఈ కేసులో జైలుకు వెళ్లారని వ్యాఖ్యానించారు. కేసీఆర్ అభిమానులు, అనుచరులు, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఆయన గురించి గొప్పలు చెప్పేవారని, ఆయన్ను అపర భగీరథుడని, నదులకు నడక నేర్పాడని పొగిడేవారని ఎద్దేవాచేశారు. నదులకు నడక నేర్పిన సంగతి దేవుడెరుగు కానీ.. మద్యం కేసులో ఢిల్లీ వరకు వెళ్లారని చురకలంటించారు. మద్యాన్ని ఇతర రాష్ట్రాలకు తరలించిన చరిత్ర, ఖ్యాతి బీఆర్ఎస్ కే దక్కిందని విమర్శించారు. దర్యాప్తు సంస్థలు ఆధారాలతో కవితని అరెస్ట్ చేస్తే.. దానిని కూడా రాజకీయానికి ముడి పెడుతున్నారని లక్ష్మణ్ ధ్వజమెత్తారు. ఈ కేసు విషయంలో బీజేపీకి ఎలాంటి సంబంధం లేదని ఆయన స్పష్టం చేశారు. తమకు సంబంధం లేని విషయాన్ని హరీశ్ రావు బీజేపీకి అంటగట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. వారికి నిజంగానే ఆ కుంభకోణంతో సంబంధం లేకుంటే న్యాయస్థానాన్ని ఆశ్రయించాలని సూచనలు చేశారు. నిష్పక్షపాతంగా దర్యాప్తు సంస్థలు చేస్తున్న పనిని రాజకీయాలతో ముడి పెట్టడం భావ్యం కాదని లక్ష్మణ్ పేర్కొన్నారు.



# కవిత అరెస్ట్ పై బీఆర్ఎస్ కన్నెర్ర

- బస్ డిపోల ముందు కార్యకర్తల బైఠాయింపు
- ప్రధాని మోడీ దిష్టిబొమ్మల దహనం
- అక్రమ అరెస్టులు ఆపాలంటూ నినాదాలు

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

ఢిల్లీ మద్యం పాలసీ కేసులో ఎమ్మెల్సీ కవిత అక్రమ అరెస్టుపై బీఆర్ఎస్ కన్నెర్ర చేసింది. అరెస్టుకు నిరసనగా రాష్ట్రవ్యాప్తంగా పార్టీ శ్రేణులు ఆందోళనలు నిర్వహిస్తున్నారు. బస్సు డిపోల ముందు బీఆర్ఎస్ కార్యకర్తలు బైఠాయించారు. మండల కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. వెయ్యి మంది మోదీలు, రేవంత్‌లు వచ్చినా భయపడేది లేదని స్పష్టం చేశారు. ఎలాంటి మచ్చలేకుండా ఎమ్మెల్సీ కవిత బయటకు వస్తారని నమ్మకం వ్యక్తంచేస్తున్నారు. నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా నిరసనలు కొనసాగుతున్నాయి. బోధన్, ఆర్మూర్, బాల్కొండ నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ నేతలు రోడ్లపై బైఠాయించారు. ప్రధాని మోదీ దిష్టిబొమ్మలను దగ్ధం చేశారు. నిజామాబాద్ పట్టణంలో జడ్పీ చైర్మన్ విఠల్ రావు ధర్నాలో పాల్గొన్నారు.

సిద్దిపేట పాత బస్టాంట్ చౌరస్తాలో బీఆర్ఎస్ కార్యకర్తలు ధర్నా చేశారు. అక్రమ అరెస్టులను వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. కరీంనగర్ జిల్లాలోని గంగాధర మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రధాని మోదీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆదిలాబాద్‌లో వ్యాపార, వాణిజ్య సముదాయాలు సంపూర్ణంగా బంద్ పాటిస్తున్నాయి. ఇక కవిత అరెస్టుకు వ్యతిరేకంగా హైదరాబాద్‌లో నిరసన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. మీర్‌పేటలో ప్రధాని దిష్టిబొమ్మను దహనం చేసిన బీఆర్ఎస్ కార్యకర్తలు.. మోదీ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. బోరబండ బస్టాండ్ వద్ద ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో నిరసనలతో హోరెత్తించారు. ఇల్లందు పట్టణంలో బీఆర్ఎస్ కార్యకర్తలు నిరసన ర్యాలీ చేపట్టారు. కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. అశ్వారావుపేట రింగురోడ్డు సెంటర్‌లో నాయకులు ధర్నా చేశారు.



# ధర్నాలు వద్దన్నోళ్లే అడ్డుకోవడం బాధాకరం

**మొదటిపేజీ తరువాయి**



కేసుకు తెలంగాణ రాష్ట్రానికి ఏమిటి సంబంధం అంటూ ప్రశ్నించారు. కవితను అరెస్టు చేసింది ఢిల్లీ పోలీసులు అయితే తెలంగాణలో ధర్నాలు చేసి ప్రజలను ఇబ్బంది పెట్టడం ఎందుకని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మండిపడ్డారు.

నాడు చంద్రబాబు అరెస్టు సందర్భంగా హైదరాబాద్ కేంద్రంగా ధర్నాలు, ఆందోళనలు చేస్తే అడ్డుకున్న వ్యక్తులు, నేడు ధర్నాలకు పిలుపునివ్వడం విడ్డూరంగా ఉందని కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఎద్దేవా చేశారు. ఢిల్లీకి చెందిన ఈడీ అధికారులు కవితను అరెస్ట్ చేస్తే తెలంగాణలో ఆందోళనలు దేనికని కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్ లో జరిగిన విషయాలకు హైదరాబాద్‌లో ధర్నాలు ఎందుకని నాడు బి ఆర్ ఎస్ నేతలు ప్రశ్నించిన విషయాలను గుర్తు చేశారు. అంతేకాదు ప్రాజెక్టుల నిర్మాణంలో అక్రమంగా సంపాదించిన డబ్బుతో స్పెషల్ ఫ్లైట్లు బుక్ చేసుకొని బీఆర్ఎస్ కార్యకర్తలను ఢిల్లీకి తీసుకుపోయి ఈడి ఆఫీస్ ముందు ధర్నాలు చేసుకోమంటూ హితవు పలికారు. నాడు ఎవడు వస్తాడో రావాలని.. తొడగొట్టి సవాల్ చేసిన నేతలు నేడు సామాన్య కార్యకర్తలను ఎందుకు రోడ్లమీద తెస్తున్నారని ప్రశ్నించారు. మీ లిక్కర్ రాజకీయాలకు రాష్ట్రాన్ని రావణ కష్టంగా మార్చాలి అనుకుంటున్నారా అంటూ నిప్పులు చెరిగారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ప్రజలు సంతోషంగా బ్రతకాలి అనుకుంటున్నారని, ఇలాంటి సమయంలో మీ కుటుంబ రాజకీయాలతో ప్రజలను ఇబ్బంది పెట్టొద్దు అంటూ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. ఏపీ ముఖ్యమంత్రి తో కుమ్మక్కు అయ్యి.. మీరు రాయలసీమకు నీళ్లు ఇవ్వడం వల్ల ప్రస్తుతం తెలంగాణలో నీళ్లు లేని దుస్థితి వచ్చిందని, రైతులు కరువుతో అల్లాడుతున్నారని అసహనం వ్యక్తం చేశారు.

# కంటోన్మెంట్ బరిలో నివేదిత

- కార్యకర్తల సమావేశం అనంతరం ప్రకటన
- త్వరలో సీఎం కేసీఆర్ ను కలుస్తానంటూ కామెంట్
- పార్లమెంటుతో పాటూ.. కంటోన్మెంట్కు ఉప ఎన్నిక



**విశాలభారతి,హైదరాబాద్ :**

కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గం ఉప ఎన్నికల్లో తాను పోటీ చేస్తానని దివంగత బీఆర్ఎస్ ఎమ్మెల్యే లాస్యనందింత సోదరి నివేదిత తెలిపారు. మార్చి 16వ తేదీ అభిమానులు, కార్యకర్తల సమావేశం తరువాత ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె ఈ విషయాన్ని వెల్లడించారు. తన తండ్రిని, సోదరిని గెలిపించినట్లే తనని కూడా ఆశీర్వదించాలని కోరారు. నాన్న సాయన్నకు మద్దతుగా నిలిచిన ప్రజలు లాస్య నందితను సైతం భారీ మెజార్టీతో గెలిపించారన్నారు. అయితే దురదృష్టవశాత్తు రోడ్డు ప్రమాదంలో మన యువ లీడర్ ను కోల్పోయామన్నారు. అయితే ఉప ఎన్నికల బరిలో తాను నిల్చొవాలని స్థానిక లీడర్లు, ప్రజలు కోరుతున్నారన్నారు. వాళ్లందరి మద్దతుతో తాను ఈ ఉప ఎన్నికల్లో పోటీ చేస్తున్నానన్నారు. బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్‌ను త్వరలో ఇదే విషయమై కలుస్తామన్నారు. ఫిబ్రవరి 23న హైదరాబాద్‌లోని అవుటర్ రింగు రోడ్డు(ఓఆర్ఆర్) పై జరిగిన రోడ్డు ప్రమాదంలో కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత మృతి చెందారు. దీంతో లోక్ సభ ఎన్నికలతో పాటుగా కంటోన్మెంట్ కు ఈసీ ఉప ఎన్నిక నిర్వహించనుంది. బీఆర్ఎస్ నివేదితకి టికెట్ ఇస్తుందా లేదా అన్నదానిపై ఇంకా క్లారిటీ రాలేదు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గంలో 1994 నుంచి 2018 వరకు మధ్యలో 2009 ఎన్నికలు మినగా.. మిగిలిన ఐదు సార్లు ఎమ్మెల్యేగా జి సాయన్న విజయం ఢంకా మోగించారు. 1994, 99, 2004 ఎన్నికల్లో టీడీపీ తరపున బరిలో దిగిన సాయన్న హ్యాట్రిక్ విజయాన్ని నమోదు చేసి.. రికార్డు సృష్టించారు. ఇక తెలంగాణ ఏర్పడిన తర్వాత కూడా 2014లో టీడీపీ తరపున బరిలోకి దిగి గెలుపొందారు. ఆ తర్వాత బీఆర్ఎస్‌లో చేరిన సాయన్న.. 2018లోనూ తన విజయ పరంపరను కొనసాగించారు. అయితే.. అనారోగ్య కారణాలతో సాయన్న 2023, ఫిబ్రవరి 19న హైదరాబాదులోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారు. సాయన్న మృతి త్వరాత.. ఆయన వారసత్వాన్ని కొనసాగించాలని స్థానిక నేతలు, అభిమానుల విజ్ఞప్తి మేరకు బీఆర్ఎస్ అధిష్ఠానం 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన కుమార్తె లాస్య నందితకు టికెట్ ఇచ్చింది. బీటెక్ చదివిన లాస్యనందిత.. గెలిచి తన తండ్రి పేరును నిలబెట్టారు. అయితే.. ఎమ్మెల్యేగా గెలిచి మూడు నెలలు గడవకముందే.. ఘోర రోడ్డు ప్రమాదంలో.. అత్యంత విషాదకరంగా లాస్యనందిత తుదిశ్వాస విడిచారు. దీంతో.. ఇప్పుడు తన తండ్రి వారసత్వాన్ని కొనసాగించేందుకు దివంగత నేత సాయన్న ఇంకో కుమార్తె, లాస్య నందిత సోదరి నివేదిత పోటీ చేసేందుకు సిద్ధమయ్యారు.



# బీఎస్పీకి ఆర్ఎస్పీ రాజీనామా

**మొదటిపేజీ తరువాయి**

బీఎస్పీదే అన్నారు. బీఆర్ఎస్, బీఎస్పీ పొత్తు లేకుండా బీజేపీ ఒత్తిడి తీసుకొచ్చిందని, ఒప్పందాన్ని ఉల్లంఘించరాదన్నదే నా అభిమతమని విశ్రాంత ఐపీఎస్ అధికారి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. రాజ్యాంగాన్ని రక్షించుకునేందుకు తాము లౌకిక కూటమి ఏర్పాటు చేస్తే ఒత్తిడి తీసుకొచ్చారని, గులాబీ పార్టీతో పొత్తు లేదని మీడియా సమావేశం పెట్టాలని తనను ఆదేశించారని ఆయన పేర్కొన్నారు. అందుకే బాధాతప్త హృదయంతో బీఎస్పీని వీడినట్లు తెలిపారు. తెలంగాణలో ఉండే బహుజన ప్రయోజనాల కోసమే తన నిర్ణయమని చెప్పారు. తాను ఎవరి ఒత్తిళ్లకు తలొగ్గబోనన్న ప్రవీణ్ కుమార్, అందరితో చర్చించాక రాజకీయ భవిష్యత్తై నిర్ణయం తీసుకుంటానని అన్నారు. భవిష్యత్లో కేసీఆర్, బీఆర్ఎస్తో కలిసి నడుస్తానని చెప్పారు. బహుజన సమాజ్ పార్టీకి రాజీనామా చేసిన తరువాత ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్, బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్‌తో సమావేశమయ్యారు. తన రాజకీయ భవిష్యత్‌పై నిర్ణయం ప్రకటించే అవకాశముంది. ఇటీవల లోక్సభ ఎన్నికల్లో కలిసి పోటీ చేయాలని నిర్ణయించుకున్న బీఆర్ఎస్, బీఎస్పీలు సీట్లపై ఏకాభిప్రాయానికి వచ్చాయి. పొత్తులో భాగంగా బీఎస్పీకి హైదరాబాద్, నాగర్‌కర్నూల్ లోక్సభ నియోజకవర్గ సీట్లను సైతం కేసీఆర్ కేటాయించిన సంగతి తెలిసిందే.

# ఎంపీ అభ్యర్థికి ఎంత కష్టం!

**మొదటిపేజీ తరువాయి**

వస్తుందో రాదో తెలీదు. ఇప్పటికీ కొన్ని చోట్ల ఏ పార్టీ పోటీ చేస్తుందన్న క్లారిటీయే లేదు. ఎలాగోలా బీఫారమ్ తెచ్చుకుని నెల, నెలన్నరలో చావో రేవో తేల్చుకుందామనుకుంటే.. ఇప్పుడు రెండునెలల పోరాటం తప్పనిసరైపోయింది. కొందరైతే నియోజకవర్గంలో తాయిలాల పంపకం కూడా షురూ చేసుకున్నారు. గిఫ్ట్ బాక్సులు పంచిపెట్టినోళ్లంతా ఓటర్లు తమ గుప్పిట్లోనే ఉన్నారన్న భరోసాతో గడుపుతున్నారు. కానీ.. మళ్లీ మనసు మార్చుకుని చేజారిపోకుండా, మరో పార్టీ వైపు చూడకుండా న్యూట్రల్ ఓటర్లను కంటికి రెప్పల్లా మే 13 దాకా కాపాడుకుంటూ రావాలి. వీలును ఓటర్ల ఇంటి చుట్టూ ప్రదక్షిణలూ చేయాలి. హైకమాండ్ అవస్థలు కూడా తక్కువేమీ లేవు. ఊరూరా తిరిగి ప్రచారం చేసుకోడానికి కావాల్సినంత టైమ్ దొరికిందని సంబరపడిపోవాలా.. 56 రోజుల పాటు ఈ పోరాటం నాన్‌స్టాప్‌గా చేయాల్సిందేనని వేదన చెందాలా? కడుపు చించుకుంటే కాళ్ల మీద పడుతుంది గనుక, దుఃఖాన్నంతా కడుపులోపలే దాచుకుంటున్నాయి పార్టీలు. 16 అసెంబ్లీ, 17 లోక్‌సభ స్థానాల్లో టీడీపీ, 14 అసెంబ్లీ, 2 లోక్ సభ స్థానాల్లో జనసేన ఇంకా అభ్యర్థుల్నే ప్రకటించలేదు. తెలంగాణలో కూడా జాబితాల కసరత్తు అసంపూర్ణంగానే ఉంది. క్యాండిడేట్ల పేర్లు ఖరారు చేయడం ఒక ఎత్తయితే.. వాళ్లతో నియోజకవర్గాల వారీగా ఎదురయ్యే అసమ్మతుల్ని చల్లార్చడం ఇంకో ఎత్తు.

2019లో నోటిఫికేషన్ వెలువడగానే తొలి దశలోనే ఏప్రిల్ 16న పోలింగ్ జరిగింది. పెద్ద గ్యాపేమీ రాలేదు., ఇప్పుడలా కాదు.. ఒక్కొక్క ఓటరునీ దాదాపు రెండునెలల పాటు జాగ్రత్తగా చూసుకోవాలి. ఇది అత్యంత ఓపికతో కూడిన విషయం.. పైగా చాలా ఖరీదైన వ్యవహారం. అంచనా కంటే మించి మరికొన్ని నోట్ల కట్టలు బైటికి తియ్యాలి.. ప్రచారంలో ఖర్చు పెట్టాలి.. కార్యకర్తల్ని మేపాలి.. అవసరాన్ని బట్టి ఓటర్ల మీద కుమ్మరించాలి. తడిసి మోపెడవ్వడం ఖాయమని క్లారిటీతో.. కళ్లల్లో రక్తకన్నీరు కుక్కుకుని.. కిమ్మనకుండా ఉండిపోయాడు తెలుగు రాష్ట్రాల్లో సగటు అభ్యర్థి మహాశయుడు.

# 'మార్పు కావాలి.. కాంగ్రెస్ రావాలి'

**మొదటిపేజీ తరువాయి**



అందజేశాం. ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలు లక్ష్యంగా పనిచేశాం. పన్ను ఎగవేతదారులపై కఠినంగా వ్యవహరించి.. ఆదాయాన్ని స్థిరీకరించాం'' అని అన్నారు.

ఈ సందర్భంగా కవిత అరెస్టు విషయంపై సీఎం స్పందించారు. ''కవిత అరెస్టును కేసీఆర్ ఖండించలేదు. ఆయన మౌనాన్ని ఏవిధంగా అర్థం చేసుకోవాలి. ఆమె అరెస్టుపై కేసీఆర్, నరేంద్ర మోడీ ఎందుకు మౌనంగా ఉన్నారు. దాని వెనక వ్యూహం ఏంటి? గతంలో ఈడీ వచ్చాక మోదీ వచ్చేవారు.. కానీ నిన్న మాత్రం మోదీ, ఈడీ కలిసే వచ్చారు. కేసీఆర్ కుటుంబం, భాజపా మద్యం కుంభకోణాన్ని నిరంతర ధారావాహికలా నడిపించారు. ఈ అరెస్ట్ భాజపా, భారాస ఆడుతున్న డ్రామా. ఎన్నికల షెడ్యూల్‌కు ఒక రోజు ముందు జరిగిన ఈ పరిణామాన్ని ఏమని అర్థం చేసుకోవాలి? 12 స్థానాల్లో కాంగ్రెస్ గెలుస్తుందని సర్వేలన్నీ చెబుతున్నాయి. మమ్మల్ని దెబ్బతీసేందుకు భాజపా-భారాస చిల్లర రాజకీయాలు చేస్తున్నాయి. ఈ అరెస్టు ఎన్నికల స్టంట్. రాష్ట్రానికి మోదీ చేసిందేమీ లేదు. ప్రధానిగా ఆయన చౌకబారు ప్రకటనలు చేయడం సరికాదు. తెలంగాణను అవమానించిన మోదీకి ఇక్కడ ఓట్లు అడిగే అర్హత లేదు'' అని రేవంత్ మండిపడ్డారు.

# ప్రైవేట్ వస్త్ర తయారీ ఆర్డర్ల సాధనకు కృషి చేయాలి

- చేనేత జౌళి శాఖ సంచాలకులు అలుగు వర్షిణి

**విశాలభారతి,సిరిసిల్ల:** సిరిసిల్లలోని చేనేత కార్మికులు, ఆసాములు ప్రైవేట్ వస్త్ర పరిశ్రమ సంబంధించిన ఆర్డర్ల సాధన దిశగా కృషి చేయాలని , మార్కెట్ లో పోటీ పడేందుకు అవసరమైన నైపుణ్య శిక్షణ, ఇతర సహాయ సహకారాలు అందించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని చేనేత జౌళి శాఖ సంచాలకులు అలుగు వర్షిణి అన్నారు. శనివారం చేనేత జౌళి శాఖ సంచాలకులు అలుగు వర్షిణి నేత కార్మికుల సమస్యల పరిష్కారం పై రాజన్న సిరిసిల్ల జిల్లా సమీకృత కలెక్టరేట్లోని మినీ సమావేశం మందిరంలో సంబంధిత కార్మిక సంఘాల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి తో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చేనేత జౌళి శాఖ సంచాలకులు అలుగు వర్షిణి మాట్లాడుతూ పరిశ్రమల మనుగడకు ప్రభుత్వం పూర్తిగా సహకరిస్తుందని, అదే సమయంలో పూర్తిస్థాయిలో ప్రభుత్వం పై ఆధారపడటం మంచిది కాదని, ప్రైవేటు రంగంలో గల అవకాశాలను సైతం అన్వేషించాలని సంచాలకులు తెలిపారు. ప్రభుత్వం ఉన్న అవకాశాల మేరకు మాత్రమే బట్ట తయారీ కోసం ఆర్డర్లు ఇవ్వగలుగుతుందని, త్వరలో సిరిసిల్లతో పాటు నారాయణపేట, చౌటుప్పల్ వంటి ప్రాంతాలలో సైతం చేనేత క్లస్టర్లు వస్తాయని, ప్రతి ఒక్కరికి ప్రభుత్వమే పని కల్పించే అవకాశం ఉండదని, ప్రైవేట్ రంగంలో గల అవకాశాలను వినియోగించుకోవాలని సంచాలకులు సూచించారు. గత 7 సంవత్సరాల నుంచి బతుకమ్మ చీరలు, ప్రభుత్వ బట్టలకు సంబంధించిన ఆర్డర్లు అందిస్తున్నప్పటికీ ఆశించిన స్థాయిలో మార్పు రాలేదని, ప్రభుత్వం పైనే ఆధారపడకుండా బహిరంగ మార్కెట్ లో గల అవకాశాలను అంది పుచ్చుకోవాలని, ప్రైవేట్ రంగంలో నిలదొక్కుకునేందుకు నేత కార్మికులకు అవసరమైన సహాయ సహకారాలను ప్రభుత్వం అందిస్తుందని అన్నారు. ప్రతి ఒక్క నేతన్న కార్మికుడు తప్పనిసరిగా టి నేతన్న యాప్ లో వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. అనంతరం సిరిసిల్ల చేనేత కార్మిక సంఘం నాయకులు వారి డిమాండ్లను తెలియజేస్తూ మొమోరండం అందజేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ పి.గౌతమి, నేత కార్మికులు, ఆసాములు , కార్మిక సంఘం నాయకులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# ఇక వచ్చేవన్నీ పెద్ద ఇండ్లే...

## నగరంలో పెరుగుతున్న ఇండ్ల విస్తీర్ణం

## చిన్న ఇండ్ల కంటే పెద్ద ఇండ్లకే ప్రాధాన్యతనిస్తున్న బిల్డర్లు

## గతేడాది కాలంగా పెరిగిన విశాలమైన ఇండ్ల క్రయవిక్రయాలు

**హైదరాబాద్ నిర్మాణ రంగంలో సమూలమైన మార్పులు చోటుచేసుకుంటున్నాయి. కొనుగోలుదారుల అభిరుచులకు అనుగుణంగా నిర్మాణదారులు విశాలమైన ఇండ్లనే నిర్మిస్తున్నారు. ఒకప్పటిలాగా సింగిల్ బెడ్రూం, డబుల్ బెడ్రూం ఇండ్ల కంటే మరింత విశాలంతో ఉండే ఫ్లాట్లను అందుబాటులోకి తీసుకువస్తున్నారు. దీంతో వెయ్యి చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉండే ప్రాజెక్టుల నిర్మాణం గణనీయంగా పడిపోతుంది. మార్కెట్లోకి ఒక్కో ఫ్లాటు వెయ్యి చదరపు అడుగులకు పైగా ఉండే విస్తీర్ణంలోనే ప్రాజెక్టులను చేపడుతుండగా, ఇండిపెండెంట్ ఇండ్ల పరిమాణం కూడా గణనీయంగా పెరిగింది. స్పేసియస్ ప్రాజెక్టులతో సాధారణ, పేద, మధ్యతరగతి వర్గాల సొంతింటికి దూరమయ్యే ప్రమాదం ఉంది. అదే గనుక జరిగే కొత్తగా ఇంటిని కొనుగోలు చేసే వారు అందుబాటులో ఉండే ప్రాజెక్టులు లేక ఓపెన్ ప్లాట్ల వైపు మొగ్గుచూపే అవకాశం ఉంది.**



**విశాలభారతి, హైదరాబాద్ :**

మెరుగైన మౌలిక వసతులు, అంతకు మించిన ఉద్యోగ, ఉపాధి అవకాశాలతో హైదరాబాద్ కేంద్రంగా రియల్ ఎస్టేట్ రంగం గణనీయంగా పెరిగింది. ఈ క్రమంలో నగరంలో స్థానిక రియల్ ఎస్టేట్ సంస్థలతోపాటు, అంతర్జాతీయ రియల్ ఎస్టేట్ సంస్థలు పెట్టుబడులతో బడా ప్రాజెక్టులను నిర్మిస్తున్నాయి.ఈ క్రమంలో హై రైజ్ ప్రాజెక్టుల సంఖ్య గణనీయంగా పెరుగుతున్న క్రమంలో... అపార్టుమెంట్ ప్రాజెక్టుల్లోనూ వినూత్నమైన ప్రాజెక్టులు అందుబాటులోకి వస్తున్నాయి. అయితే బిల్డర్లు విశాలమైన ప్రాజెక్టులను నిర్మించేందుకు అత్యంత ప్రాధాన్యతనిస్తున్నారు. ఇటీవల కాలంలో వెయ్యి చదరపు అడుగుల లోపు ఉండే ప్రాజెక్టుల సంఖ్య గణనీయంగా పడిపోతుండటమే... హైదరాబాద్ కేంద్రంగా బడా ఇండ్లకు పెరుగుతున్న డిమాండ్‌కు నిదర్శనం. తాజాగా వెలువడిన అధ్యయనంలోనూ ఏటా భారీ విస్తీర్ణంలో ఉండే ఇండ్ల నిర్మాణం పెరుగుతుండగా గతేడాది కాలంలోనే ఏకంగా 6900 ప్రాపర్టీలు నమోదైనట్లుగా తేలింది.

హైదరాబాద్‌లోని హౌజింగ్ రంగంలో 21 మేర వృద్ధి నమోదైంది. నైట్ ఫ్రాంక్ ఇండియా తాజాగా విశ్లేషించిన రాష్ట్ర రిజిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్ డేటా ప్రకారం ఫిబ్రవరి 2024లో హైదరాబాద్‌లో మొత్తం 6,938 రెసిడెన్షియల్ ప్రాపర్టీల రిజిస్ట్రేషన్ జరిగినట్లుగా పేర్కొంది. ఇందులో విస్తీర్ణాల వారీగా నివేదికను రూపొందించగా... ఎక్కువగా వెయ్యి చదరపు అడుగులకు మించిన ప్రాజెక్టులు ఉండటమే విశేషం. నగరంలో నివాస ప్రాపర్టీల రిజిస్ట్రేషన్‌లో ఇయర్‌ఆన్‌ఇయర్ లెక్కన 21 శాతం పెరిగినట్లుగా వెల్లడించింది. రాష్ట్ర రిజిస్ట్రేషన్ శాఖ డేటా ప్రకారం ఫిబ్రవరి 2024లో నగరం మొత్తం 6,938 రెసిడెన్షియల్ ప్రాపర్టీలను నమోదు చేసినట్లు నివేదించింది. పెరిగిన రిజిస్ట్రేషన్ల రేటుతో, రాష్ట్రం నెలవారీగా 27 శాతం పెరుగుదల ఉంది. ఈ నివేదిక ప్రకారం ఫిబ్రవరి వరకు కొత్త ఎంట్రీలను పరిగణనలోకి తీసుకుంటే ఆ ఆస్తుల మొత్తం విలువ రూ. 4247 కోట్లకు చేరుకుంది. ఇది నెలవారీగా నమోదైన పెరుగుదలలో 29 శాతంగా ఉందని, వార్షికంగా 42 శాతంగా ఉన్నట్లుగా పేర్కొంది.

### శివారులకు డిమాండ్...

గతేడాది కాలంగా హైదరాబాద్ నగర శివారులకు డిమాండ్ పెరుగుతున్నది. ముఖ్యంగా నగరం చుట్టూరా విస్తరించి ఉన్న అవుటర్ రింగు రోడ్డుకు సమీపంలో ఉన్న ప్రాంతాల్లోకి కొత్త ప్రాజెక్టుల నిర్మాణం పెగరడంతో... రెసిడెన్షియల్ ప్రాజెక్టుల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఈ క్రమంలో రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లోని ప్రాంతాలు భవిష్యత్ రెసిడెన్షియల్ మార్కెట్‌కు వేదికగా నిలుస్తున్నాయి. గతేడాది కాలంగా రెసిడెన్షియల్ ప్రాపర్టీల లావాదేవీలు సగటున 10శాతం మేర పెరిగినట్లుగా నివేదికలు చెబుతున్నాయి. మేడ్చల్-మల్కాజ్‌గిరిలో అత్యధికంగా 15 శాతం పుంజుకోగా, రంగారెడ్డిలో 5 శాతం మేర నమోదైంది. కోర్ హైదరాబాద్ ప్రాంతంలో లావాదేవీలు 2 శాతం పెరిగాయి. దీంతోపాటు కొత్తగా వచ్చే ప్రాజెక్టులు కూడా శివారుల్లోనే ఎక్కువగా ఉండటంతో... హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్‌కు వేదికగా నిలుస్తోంది.



**కొనుగోళ్లు ఉన్నా... నిర్మించడంలేదు**

తాజాగా వెల్లడైన నైట్ ఫ్రాంక్ అధ్యయనం ప్రకారం నగరంలో 1000 చదరపు అడుగుల లోపు ఉండే నిర్మాణాల సంఖ్య 16శాతం పడిపోయింది. నిజానికి సాధారణ, మధ్య తరగతి వర్గాలకు చెందిన వెయ్యి లోపు చదరపు అడుగుల లోపు ఉండే ఇండ్లను కొనుగోలు చేసేందుకే ప్రాధాన్యతనిస్తోంది. అయినా బిల్డర్లు, నిర్మాణ సంస్థలు ఎక్కువగా వెయ్యికి చదరపు అడుగులకు మించిన ప్రాజెక్టులను మాత్రమే నిర్మిస్తున్నారు. దీంతో రూ. 25 లక్షల కంటే తక్కువ ధరలో ఉండే ప్రాపర్టీల రిజిస్ట్రేషన్ తగ్గిపోవడానికి దారితీసిందని నైట్ ఫ్రాంక్ పేర్కొంది. అదేవిధంగా చిన్న ఇళ్లు(1000 చదరపు అడుగుల లోపు) డిమాండ్ 16 శాతానికి పడిపోయినట్లుగా పేర్కొంది. గతేడాదితో చిన్న ఇళ్ల డిమాండ్లు 20 శాతంగా, ఒక్క ఏడాదిలో నాలుగు శాతం మేర పడిపోయింది. అదే సమయంలో పెద్ద ఇండ్లకు (2,000 చదరపు అడుగుల కంటే ఎక్కువ) 13శాతం మేర డిమాండ్ పెరిగింది. గతేడాదితో పోల్చితే 10 శాతంగా ఉంది. రూ. 1 కోటి పైబడిన ఆస్తుల క్రయవిక్రయాలు క్రమంగా పుంజుకుంటున్నాయి. ఫిబ్రవరి 2024లో 14 శాతం మేర పెరగగా, ఫిబ్రవరి 2023లో 10 శాతంగా ఉంది. ఫిబ్రవరి 2024లో, 1,0002,000 చదరపు అడుగులలోపు నివాస ఆస్తులు ఎక్కువగా నమోదు కాగా, మొత్తం రిజిస్ట్రేషన్లలో వీటి వాటా 71శాతంగా ఉన్నాయి. కొనుగోలుదారులకు విశాలమైన ఇండ్లను అందించడంతోపాటు, మెరుగైన మౌలిక వసతులు, సౌకర్యాలను అలవాటు చేయడంతోనే పెద్ద ఇండ్ల నిర్మాణాలు గణనీయంగా పెరగడానికి కారణంగా చెబుతున్నారు. అదే సమయంలో రంగారెడ్డి, హైదరాబాద్ వంటి మార్కెట్లలో రూ.4. 2కోట్లకు పైగా విలువ చేసే మూడు వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉండే ఆస్తులకు సంబంధించి గణనీయంగా ఒప్పందాలు జరిగాయి.



### విశాలమైన ఇండ్లకు ఆదరణ...

కరోనా తర్వాత వర్క్ ఫ్రం హోం విధానానికి అత్యంత ఆదరణ వచ్చింది. ఈ క్రమంలో డబుల్, ట్రిపుల్ బెడ్రూం ఇండ్లలోనూ ఖచ్చితంగా వర్క్ ప్లేస్ ఏర్పాటు చేయాల్సిందే. ఈ క్రమంలో 2.5 బీహెచ్‌కే నిర్మాణాల జోరందుకున్నాయి. అదేవిధంగా వర్క్ ప్లేస్ ఏర్పాటు తప్పనిసరి కావడంతో క్రమంగా ఇండ్ల పరిమాణం కూడా పెరిగింది. దీంతోనే ఒకప్పుడు హైదరాబాద్ కేంద్రంగా సర్వసాధారణంగా కనిపించే సింగిల్ బెడ్రూం, 1000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉండే ప్రాజెక్టుల సంఖ్య గణనీయంగా తగ్గింది. ఇప్పటికీ ఆఫర్డబుల్ ప్రాజెక్టులకు డిమాండ్ ఉన్నప్పటికీ... నగరంలో 1000కిపైగా చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉండే ప్రాజెక్టులను బిల్డర్లు నిర్మించేందుకు ప్రాధాన్యతనిస్తున్నారు.

**రియల్ ఎస్టేట్‌పై ప్రభావం...**

రెండు కోట్ల జనాభాకు చేరిన హైదరాబాద్ కేంద్రంగా ఇప్పటికీ సొంతిళ్లు లేని వారి సంఖ్య భారీగానే ఉంది. ఓవైపు ప్రభుత్వం పేద, మధ్యతరగతి వారికి డబుల్ బెడ్రూం ఇండ్లను నిర్మించి ఇస్తున్నా ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకునే వారి పెరుగుతూనే ఉంది. అంటే ఇప్పటికీ పేద, మధ్యతరగతికి అనువైన ప్రాజెక్టులకు డిమాండ్ ఉందనేది స్పష్టమైతుంది. అయినా బిల్డర్లు, నిర్మాణ సంస్థలు 1000 చదరపు అడుగులకు పైబడిన ప్రాజెక్టులను నిర్మిస్తున్నాయి. ఒకవేళ కొత్త ప్రాజెక్టుల్లోనూ 1000 చదరపు అడుగుల లోపు ఉండే ఫ్లాట్ల సంఖ్య 10 శాతం లోపే నిర్మిస్తుండగా భారీ సంఖ్యలో ఉన్న పేద, మధ్యతరగతి వర్గాలు మార్కెట్‌కు దూరమయ్యే అవకాశం ఏర్పడుతుంది. ఇక బడా సంస్థలతోపాటు స్టాండ్ ఎలోన్ ప్రాజెక్టుల పరిమాణం కూడా వెయ్యి చదరపు అడుగులకు మించి నిర్మిస్తుండగా, రానున్న రోజుల్లో బడా విస్తీర్ణంలో ఉండే ఇండ్లను కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొనే అవకాశం ఉంది.



# వాహానం ఢీకొని వ్యక్తి మృతి

**చిట్యాల, విశాలభారతి:**

పట్టణంలోని భువనగిరి రోడ్డులో వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందడం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జగిత్యాలకు చెందిన వనం వెంకటమ్మ, తన భర్త రాములతో కలిసి తమ కుమార్తెను ఆసుపత్రిలో చికిత్స చేయించడానికి చిట్యాల పట్టణానికి వచ్చారు. శుక్రవారం రాత్రి 10గం.ల సమయంలో భువనగిరి రోడ్డు లోని లక్ష్మీ గార్డెన్ కి దగ్గరలో రాములు టీ తాగి రోడ్డు దాటుతుండగా TS 05 UD 5963 నెంబర్ గల డ్రైవర్ తన వాహహాన్ని భువనగిరి వైపు వెళ్తూ అతివేగంతో వెళ్తూ ఢీకొట్టడంతో తీవ్రగాయాలు అయి అక్కడికక్కడే మృతి చెందడం జరిగింది. మృతుని భార్య వెంకటమ్మ ఫిర్యాదు మేరకు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్.ఐ సైదాబాబు తెలిపారు.



# రైతులను ప్రోత్సహించాలి

**డాక్టర్ యమ్ మల్లారెడ్డి**

**గరిడేపల్లిz విశాల భారతి:**

కే.వి.కే గడ్డిపల్లిలో శనివారం రోజు ఏర్పాటు చేసిన శాస్త్రీయ సలహా సంఘం సమావేశంలో ప్రాంతీయ పరిశోధనా స్థానం పాలెం, అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ పాలెం, డాక్టర్ యమ్ మల్లారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని రైతులని, శాస్త్రవేత్తలను ఉద్దేశించి మాట్లాడారు. శాస్త్రవేత్తలు రైతుల ఆదాయం రెట్టింపు కోసం కృషి చేయాలి అని అన్నారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా నూతన సాంకేతికతను ఎప్పటికప్పుడు శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కల్పించాలి అన్నారు. వరికి ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటలు సాగు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘసభ్యులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

# వైద్యం వికటించి బాలుడి మృతి

**గరిడేపల్లి, విశాలభారతి:**

లక్ష్మీపురం గ్రామానికి చెందిన లొడంగి శిరీష సాయి కృష్ణల కుమారుడు లొడంగి సిద్ధార్థ (5)కు శుక్రవారం సాయంత్రం వాంతులు విరేచనాలు అవుతుండగా హుజూర్ నగర్ పట్టణంలోని ఇందిరా పిల్లల హాస్పిటల్ కి తీసుకొని రాగా బాలునికి చికిత్స చేశారని, వైద్యం వికటించి బాలుడు ఇవాళ ఉదయం చనిపోయాడని తల్లిదండ్రులు తెలిపారు.



# ఆదివాసీ గ్రామాన్ని సందర్శించిన ఎంపీఓ

- ఐటీడీఏ పీవో ద్వారా సమస్యల పరిష్కారానికి కృషి
- వాగులు, వంకలు దాటి ఐదు కిలోమీటర్ల దూరం ప్రయాణం

**పినపాక , విశాలభారతి :**

అదొక వలస ఆదివాసీ గ్రామం. ఆ గ్రామంలో అనేక సమస్యలు నెలకొనడం దానిలో ప్రధానంగా తాగునీటి సమస్య ఉండటంతో ఈ విషయం తెలుసుకున్న ఎంపీఓ వెంకటేశ్వరరావు, స్థానిక సెక్రటరీ కృష్ణమూర్తి తో కలిసి కనీస రహదారి సౌకర్యం కూడా లేని ఆ గ్రామాన్ని ఐదు కిలోమీటర్ల మేర వాగులు, వంకలు దాటి ప్రయాణించడమే కాకుండా గ్రామంలో ఉన్న ప్రతి సమస్యను కానీ స్వయంగా పరిశీలించి తన పరిధి మేరకు సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీని ఇచ్చారు. ఈ సందర్భంగా గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యపై స్పందించిన తాను స్వయంగా బోరును పరిశీలించగా నీటి లభ్యత తక్కువగా ఉందని తెలిసి రిజర్వ్ ఫారెస్ట్ ఏరియా ప్రాంతం కావడంతో కొత్తగా బోరు, రహదారి సౌకర్యాన్ని కల్పించే క్రమంలో అనుమతుల కోసం స్థానిక అటవీశాఖ అధికారుల ద్వారా ఐటిడిఏ పిఓ దృష్టికి తీసుకువెళ్లి తాగునీటి సౌకర్యాన్ని పునరుద్ధరిస్తామని తెలిపారు .అదే విధంగా కరోనా సమయంలో బాలింతలు, పిల్లల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ద్వారా సరఫరా చేయబడిన పౌష్టికాహారాన్ని ఐదు కిలోమీటర్ల మేర వాగులు, వంకలు దాటి నడిచి తీసుకు వచ్చి అందించిన అంగనవాడి టీచర్ చంద్రకళ పనితీరును గుర్తించిన కేంద్ర ప్రభుత్వం రాష్ట్రపతి చేతుల మీదుగా ఉత్తమ అంగనవాడి టీచరుగా ఎంపిక చేయడంతో పాటు, అవార్డును ఢిల్లీలో బహుకరించిన విషయాన్ని తెలుసుకొన్న ఎంపీఓ వెంకటేశ్వరరావు అంగన్వాడి టీచర్ను ప్రత్యేకంగా అభినందించారు. టేకులగూడెం గ్రామాన్ని సందర్శించే క్రమంలో కనీస రహదారి సౌకర్యం లేకపోవడమే కాకుండా వాగులు, వంకలు దాటి చేసిన ప్రయాణం చేసి అక్కడి గ్రామస్తులు పడే ఇబ్బందులను తెలియజేసిందని తెలిపారు.



# సేవాలాల్ కార్పొరేషన్ ఏర్పాటుపై హర్షం

- ప్రభుత్వ విప్ డాక్టర్ రామచంద్రనాయక్ సన్మానించిన లంబాడి నాయకుడు
- లంబాడి యువ నాయకుడు విజయ్ నాయక్

**మరిపెడ, విశాలభారతి:**

గిరిజనులకు ప్రభుత్వం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసినందుకుగాను, ప్రభుత్వ విప్ డోర్నకల్ శాసనసభ్యులు రామచంద్రనాయక్ కు శుభాకాంక్షలు తెలిపిన మరిపెడ మండలం కాంగ్రెస్ యువజన నాయకుడు విజయ్ నాయక్.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవలే 16 కార్పొరేషన్లు ఏర్పాటు చేయడం జరిగింది.గిరిజనులకు ప్రత్యేక కార్పొరేషన్ సేవాలాల్ మహారాజ్ లంబాడా కార్పొరేషన్ ఏర్పాటు చేసిన సందర్భంగా , మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలంలోని గిరిజన నాయకులు డోర్నకల్ శాసనసభ్యులు ప్రభుత్వ విప్ Dr. రాంచంద్రు నాయక్ ను కలిసి సన్మానించి పుష్పగుచ్చం, సేవాలాల్ మహారాజ్ చిత్రపటం అందచేసి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. సేవాలాల్ మహారాజ్ లంబాడా కార్పొరేషన్ ఏర్పాటు చేసినందుకు తెలంగాణ ముఖ్యమంత్రి వార్యులు రేవంత్ రెడ్డి గారికి వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ యువజన కార్యకర్తలు జరుపుల విజయ్ నాయక్, సుధాకర్ నాయక్, దరంసోత్ రామకృష్ణ నాయక్, సురేష్ నాయక్, రవి నాయక్, వీరన్న నాయక్, నరేష్ నాయక్, భోజ్య నాయక్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.




# వర్కర్ల వేతనాలు వెంటనే చెల్లించాలి

**నూతనకల్, విశాలభారతి:**

మిషన్ భగీరథలో పనిచేస్తున్న కార్మికుల ఐదు నెలల పెండింగ్ వేతనాలను విడుదల చేయాలని చిల్పకుంట్ల మిషన్ భగీరథ ప్లాంట్ ముందు ధర్నా చేసి మిషన్ భగీరథ ఏఈ గుండు రావు గారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రగతిశీల మిషన్ భగీరథ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి మొగుళ్ళ గోపాల్,ప్లాంట్ అధ్యక్షులు చంద్రయ్య పాల్గొని మాట్లాడుతూ గత ప్రభుత్వం మిషన్ భగీరథ కాంటాక్ట్ వర్కర్స్ ను పట్టించుకోలేదని, కనీస ఉద్యోగ భద్రత కల్పించలేదని, వెట్టి చాకిరి చేయుంచుకుందని ఆవేదన వ్యక్తం చేశారు. నేడు ఐదు నెలలు అవుతున్న కాంట్రాక్టర్లు జీతాలు ఇవ్వకపోవడంతో కుటుంబాలపై ఆర్థిక భారం పడి అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తక్షణమే వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కనీస వేతనాలను ఐదు సంవత్సరాలకు ఒకసారి సవరించాలని చట్ట బద్ధంగా ఉన్న నేటి వరకు మిషన్ భగీరథలో పనిచేస్తున్న వర్కర్లకు వేతనాలు పెంచలేదని, జీవో నెంబర్ 60 ప్రకారం కూడా వేతనాలు ఇవ్వడం లేదని విమర్శించారు. పెరుగుతున్న ధరల కనుగునంగా కనీస వేతనాలు పెంచాలని ,ఈఎస్ఐ కార్డులు ఇవ్వాలని లేని పక్షంలో ఈనెల 18 నుండి సమ్మెలోకి వెళ్తామని అధికారులకు తెలియజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు కూసు ఉప్పలయ్య, గంట రామకృష్ణ సైదులు, హరికృష్ణ,సత్యనారాయణ, ఎల్లయ్య, జతంగి శేకర్ తదితరులు పాల్గొన్నారు.

# కవిత అరెస్టుకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ నిరసన

**పాల్గొన్న బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి గాలి అనిల్**



**పటాన్ చెరు(జహీరాబాద్), విశాలభారతి :**

భారత జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అక్రమ అరెస్టును ఖండిస్తూ జహీరాబాద్ లో ఎమ్మెల్యే మాణిక్ రావు, జహీరాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి గాలి అనిల్ కుమార్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. వందల మంది కార్యకర్తలతో జహీరాబాద్ పట్టణంలో పాదయాత్ర నిర్వహించారు. స్థానిక బస్ స్టాండ్ చౌరస్తాలో రాస్తారోకో నిర్వహించారు. రాస్తారోకో నిర్వహిస్తున్న మాణిక్ రావు, అనిల్ కుమార్, కార్యకర్తలను బలవంతంగా పోలీసులు లేపారు. ఈ సందర్భంగా అనిల్ కుమార్ మాట్లాడుతూ..దేశంలోని ఈడీ, సీబీఐ, లాంటి సంస్థలను బీజేపీ నిర్వీర్యం చేస్తూ, ప్రతిపక్ష పార్టీ నేతలను అణిచివేతే ప్రధాన లక్ష్యంగా అక్రమ కేసులు బనాయిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. త్వరలో థార్డ్ ఫ్రంట్ అధికారంలోకి రాబోతుందని, బీజేపీకి గట్టి బుద్ధి చెబుతామని ఆయన హెచ్చరించారు. ఎమ్మెల్సీ కవితపై బనాయించిన అక్రమ కేసులు ఎత్తేసే వరకు రాష్ట్రవ్యాప్తంగా బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ నిరసనలు కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎస్ఐడీసీ మాజీ చైర్మన్ తన్వీర్, ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, బిఆర్ఎస్ పార్టీ ప్రధాన నాయకులు, ప్రజాపతినిధులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.







# గీతంలో విజయవంతంగా ముగిసిన క్రీడా పోటీలు

**పటాన్ చెరు,విశాలభారతి:**

గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్ లో 'గస్టో 2024' పేరిట నిర్వహిస్తున్న మూడు రోజుల అంతర్ విశ్వవిద్యాలయ క్రీడా పోటీలు విజయవంతంగా ముగిసినట్టు శనివారం వెల్లడించారు. విజేతలకు ప్రొఫెసర్ సి.త్రినాథరావు, ప్రొఫెసర్ ఎం.అక్కలక్ష్మి, డాక్టర్ వి.ఫణికుమారి, డాక్టర్ ఉమా సుస్మిత పెరెపా, డాక్టర్ ఎం.నారాయణరావు చౌదరి తదితరులు బంగారు పతకాలు, ట్రోఫీలను ఇచ్చి సత్కరించారు. వివిధ క్రీడల్లో పాల్గొనడం వల్ల విద్యార్థులలో క్రీడా స్ఫూర్తి పెంపొందుతుందని వారు ఉద్ఘాటించారు. ముఖ్యమైన జీవిత పాఠమైన గెలుపుఓటమి రెండింటినీ సునాయాసంగా అంగీకరించడం నేర్చుకుంటారని వారు అభిప్రాయపడ్డారు. వివిధ క్రీడా పోటీల విజేతలు, ద్వితీయ విజేతల వివరాలు... బ్యాడ్మింటన్ విజేత భవన్స్, రన్నరప్ మహీంద్రా విశ్వవిద్యాలయం, బాస్కెట్బాల్ (పురుషుల) విజేత సీఎన్ఆర్ నీజేఐఈటీ, రన్నరప్ గీతం, బాస్కెట్బాల్ (మహిళలు) విజేత విల్లా మేరీ, రన్నరస్ మహీంద్రా విశ్వవిద్యాలయం, క్రికెట్ విజేత ఎంవీఎస్ఆర్, రన్నరప్ గురునానక్ ఇన్స్టిట్యూట్, ఫుట్బాల్ (పురుషులు) విజేత ముహీంద్రా విశ్వవిద్యాలయం, రన్నరప్ గీతం, ఫుట్బాల్ (మహిళలు) విజేత గీతం, రన్నరప్ సుహీంద్రా విశ్వవిద్యాలయం, కబడ్డీ (పురుషులు) విజేత గీతం, రన్నరప్ ఏఎస్ఆర్ ఏజేఐఈటీ, కబడ్డీ (మహిళలు) విజేత గీతం, రన్నరప్ సిఎన్ఆర్ విజేఐఈటీ, టేబుల్ టెన్నిస్ (పురుషులుసింగిల్స్) విజేత మెథడిస్ట్ కళాశాల విద్యార్థి త్రిశూల్, రన్నరప్ గీతం విద్యార్థి ప్రణీత్, టేబుల్ టెన్నిస్ (పురుషులు డబుల్స్) విజేతలు విట్ఏపీకి చెందిన సందీప్అభిషేక్, రన్నరప్ మహీంద్రా విశ్వవిద్యాలయానికి చెందిన నీవర్ రోహిత్, టేబుల్ టెన్నిస్ (మహిళలు సింగిల్స్) విజేత కేఎస్ఆర్యా హెచ్ఎస్ కు చెందిన ఇక్షిత, రన్నరప్ మహీంద్రా విశ్వవిద్యాలయానికి చెందిన ఆయుషి, త్రోబాల్ విజేత ఏఎన్ఆర్ వీజేఐఈటీ, రన్నరప్ సుహీంద్రా విశ్వవిద్యాలయం, వాలీబాల్ విజేత నిజాం కళాశాల, రన్నరప్ నిట్ఏపీ. తొలుత, న్యూఢిల్లీలో జనవరి 26న నిర్వహించిన గణతంత్ర దినోత్సవ పెరేడ్లో ఎన్సీసీ తరఫున సాంస్కృత ప్రదర్శన చేసిన బీసీ విద్యార్థిని భావరాజు నందినిని అతిథులు సత్కరించారు. ఈ కార్యక్రమాన్ని స్పోర్ట్స్ మేనేజర్ తపస్వి సమన్వయం చేయగా, క్రికెట్ టీమ్ కెప్టెన్ యశ్వంత్ రెడ్డి వందన సమర్పణతో ముగిసింది.



# గణేష్ గడ్డ శ్రీ సిద్ధి గణపతి హుండీ లెక్కింపు

- హుండీ ఆదాయం రూ.15,41,514
- అన్నదానం హుండీ ఆదాయం రూ.80,814

**పటాన్ చెరు,విశాలభారతి:**

పటాన్ చెరు మండలం రుద్రారం గ్రామపంచాయతీ పరిధిలోని గణేష్ గడ్డ నందు స్వయంభుగా వెలిసిన శ్రీ సిద్ధి గణపతి ఆలయంలో శనివారం హుండీ లెక్కింపును నిర్వహించారు. శ్రీ సిద్ధి గణపతి ఆలయానికి సంబంధించిన 68 రోజుల హుండీ ఆదాయం రూ.15,41,514 (పదిహేను లక్షల నాలబై ఒక్క వెయ్యి ఐదు వందల పద్నాలుగు రూపాయలు), అలాగే అన్నదానం హుండీ ఆదాయం రూ.80,814 (ఏనబై వేల ఏనిమిది వందల పద్నాలుగు రూపాయలు) వచ్చిందని ఆలయ ఈఓ పి.మోహన్ రెడ్డి తెలిపారు. హుండీ లెక్కింపును దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమీషనర్ వి.శివరాజ్ సమక్షంలో కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హుండీలో వచ్చిన ఆదాయాన్ని దేవాలయం అభివృద్ధికి ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలను సమకూర్చున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది మల్లికార్జున్ రెడ్డి, ఈశ్వర్, అర్చకులు సంతోష్ శర్మ, సతీష్ శర్మ, అజయ్ శర్మ, జగదీశ్ స్వామి, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

## ధర్మకర్తల మండలి ఏర్పాటుకు నోటిఫికేషన్ జారీ..

పటాన్ చెరు మండలం రుద్రారం గ్రామంలో ఉన్న శ్రీ గణేష్ దేవస్థానంకు నూతన ధర్మకర్తల మండలి ఏర్పాటు కానున్నదని ఆలయ ఈఓ పి.మోహన్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఆలయ ధర్మకర్తల కమిటీ ఏర్పాటుకు నోటిఫికేషన్ జారీ చేసినట్లు తెలిపారు. ఆసక్తి ఉన్నవారు జిల్లా దేవాదాయ ధర్మాదాయ శాఖ సహాయ కమీషనర్ కార్యాలయములో 20 రోజులలో దరఖాస్తు చేసుకోవాలని ఈఓ కోరారు.



# కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తోంది

- అక్రమ కేసులు.. ఆస్తుల విధ్వంసాలతో అడ్డుకోలేరు
- ఎన్నికల సమయంలోనే రాజకీయాలు చేయాలి
- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

**పటాన్ చెరు(జిన్నారం), విశాలభారతి:**

ఎన్నికల సమయంలో మాత్రమే రాజకీయాలు చేయాలే తప్ప.. తమ పార్టీలో చేరికల కోసం అక్రమ కేసులు, ఆస్తుల విధ్వంసాలతో ఒత్తిళ్లకు గురి చేయడం కాంగ్రెస్ పార్టీకి చెల్లిందని, ఇలాంటి చర్యలు ప్రజాస్వామ్యానికి పెనుముప్పుగా మారుతున్నాయని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. జిన్నారం మండలం మాదారం గ్రామంలో రెండు రోజుల క్రితం గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తల భవనాలను అక్రమంగా నిర్మించారంటూ కూల్చివేసిన సందర్భంగా.. శనివారం మధ్యాహ్నం ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి గ్రామంలో పర్యటించి బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు అధైర్య పడాల్సిన అవసరం లేదని, పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందని, వ్యక్తిగతంగా ఆర్థిక సాయం అందజేస్తానని వారికి ధైర్యం అందించారు. తాత ముత్తాతల నుండి వస్తున్న సొంత స్థలాల్లో జీవనాధారం కోసం దుకాణాల సముదాయాలు నిర్మించుకుంటే.. కక్షపూరితంగా అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు అధికారులకు ఫిర్యాదులు చేసి అక్రమంగా కూల్చి వేయించడం సరికాదని హెచ్చరించారు. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాలు మారడం అత్యంత సహజమని, అధికారులు ఒత్తిళ్లకు తలొగ్గకుండా నిక్షక్షపాతంగా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రభాకర్, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు వెంకటేష్ గౌడ్, గ్రామ మాజీ సర్పంచ్ సురేందర్ గౌడ్, పార్టీ మండల అధ్యక్షులు రాజేష్, మండల ప్రజా ప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పది విద్యార్థులకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం

## ఎ. విజయ కుమార్, జిల్లా ప్రజా రవాణా అధికారి

**భద్రాద్రి, విశాలభారతి :**



ఈనెల 18వ తేదీ నుండి 30 వరకు జరిగే 10 వ తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థినీ, విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా బస్సులను నడుపుతున్నట్టు జిల్లా ప్రజా రవాణా అధికారి ఏ. విజయ కుమార్ శనివారం తెలిపారు. విద్యార్థులు ఇంటి వద్ద నుండి పరీక్ష కేంద్రం వరకు అన్ని పల్లెవెలుగు మరియు ఆల్ట్రా పల్లెవెలుగు బస్సులలో ఉచిత ప్రయాణానికి అనుమతిస్తున్నట్లు ఆయన తెలిపారు. విద్యార్థులు కేవలం హాల్ టికెట్ ను చూపించి ఉచితంగా ప్రయాణం చేయవచ్చని ఆయన అన్నారు. విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకుని పరీక్షలలో ఉత్తమ ప్రతిభ కనబరచి ఉత్తీర్ణులు కావాలని ఆయన ఆకాంక్షించారు.



# కాలనీలో సమస్యలు పరిష్కరించండి

**ఇబ్రహీంపట్నం, విశాలభారతి:**

తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని ఇంజాపూర్ 24వ వార్డు ఆపిల్ ఎవెన్యూ కాలనీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని మున్సిపాలిటీ కమిషనర్ సత్యనారాయణ రెడ్డికి కాలనీ వాసులు వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు గుండ్లపల్లి హరితధనరాజ్ గౌడ్ ఆధ్వర్యంలో మున్సిపాలిటీ కమిషనర్ ను కాలనీ వాసులు కలిశారు. కాలనీలో దోమల బెడద అధికంగా ఉందని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. మసాబ్ చెరువు కింద కాలువ పారుతుండటం, డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల దగ్గర నీరు నిల్వ ఉండటం వల్ల దోమలు విపరీతంగా పెరుగుతున్నాయని అన్నారు. అలాగే కాలనీలో ఉన్న సమస్యల ఒకసారి తమ ప్రాంతంలో పర్యటించాలని, కాలనీ మౌలిక వసతులు కల్పించాలని కోరినట్లు తెలిపారు. ఈ ఆపిల్ అవెన్యూ కాలనీ అధ్యక్షులు చెన్నారెడ్డి, గౌరవ అధ్యక్షులు రమణ విశ్వం, ప్రభాకర్ రెడ్డి, సుధాకర్, జగన్మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.



# సగర కార్పొరేషన్ ఏర్పాటుకు సిఎం, మంత్రిని కలిసిన రాష్ట్ర సగర సంఘం

## కార్పొరేషన్ ఏర్పాటుచేస్తామని హామీ ఇచ్చిన మంత్రి పొన్నం

**శేరిలింగంపల్లి,విశాలభారతి**

సగర కులానికి కార్పొరేషన్ ఏర్పాటు చేసి పాలకమండలి తో పాటు బడ్జెట్ కేటాయించాలని కోరుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ లను తెలంగాణ సగర సంఘం రాష్ట్ర కమిటీ కలిసి విజ్ఞప్తి చేసింది. సగరుల జీవనస్థితిగతులను వివరిస్తూ శనివారం రాష్ట్ర సగర సంఘం అధ్యక్షులు ఉప్పరి శేఖర్ సగర ఆధ్వర్యంలో రాష్ట్ర నాయకులు వినతి పత్రాన్ని అందజేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. అనంతరం రాష్ట్ర బిసి మంత్రి పొన్నం ప్రభాకర్ ను కలిసిన సగర సంఘం నాయకులు కులవృత్తి నిర్మాణ రంగం పైనే ఆధారపడిన తమకు ఫెడరేషన్ కాకుండా కార్పొరేషన్ ఏర్పాటు చేసి పాలకమండలిని వేయడంతో పాటు అవసరమైన బడ్జెట్ కేటాయించాలని కోరారు. అందుకు మంత్రి పొన్నం సానుకూలంగా స్పందిస్తూ పార్లమెంట్ ఎన్నికల అనంతరం ఇతర బిసి కులాలతో పాటుగా సగర కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సగర సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఉప్పరి శేఖర్ సగర, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌరక్క సత్యం సగర, మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు గాండ్ల స్రవంతి సగర, హన్మకొండ కార్పొరేటర్ గుంటి రజిత శ్రీనివాస్ సగర, మాజీ కార్పొరేటర్లు విద్యాసాగర్, రవీందర్ సగర, సీనియర్ నాయకులు నలుబాల సతీష్ సగర తదితరులు ఉన్నారు.





# ప్రాంతీయ పార్టీలను అణచివేసే కుట్రలో భాగమే కవిత అరెస్ట్

- కవిత అరెస్టుకు నిరసనగా బీఆర్ఎస్ ఆందోళన
- పటాన్ చెరు జాతీయ రహదారిపై రాస్తారోకో

**పటాన్ చెరు,విశాలభారతి:**

బిఆర్ఎస్ ఎమ్మెల్సీ, భారత జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అరెస్టును నిరసిస్తూ ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఆదేశాలకు అనుగుణంగా పార్టీ శ్రేణులు పటాన్ చెరు పట్టణంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం నుండి ర్యాలీగా బయలు దేరి జాతీయ రహదారిపై రాస్తారోకో చేపట్టి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రభాకర్, పటాన్ చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ లు మాట్లాడుతూ ప్రాంతీయ పార్టీల అంచివేయాలన్న దుర్బుద్ధితో కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఎమ్మెల్సీ కవితపై అక్రమంగా కేసు నమోదు చేసి, ఇబ్బందులకు గురిచేస్తుందని విమర్శించారు. అరెస్టు పూర్తిగా రాజకీయ ప్రేరేపితమని, బీజేపీలో చేరితే అన్ని కేసులు మాయమవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో అమీన్ పూర్ ఎంపీపీ దేవానందం, గుమ్మడిదల జెడ్పిటిసి కుమార్ గౌడ్, కార్పోరేటర్ పుష్ప నగేష్, అమీన్ పూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ నరసింహ గౌడ్, ఏఎంసి మాజీ చైర్మన్ విజయకుమార్, సీనియర్ నాయకులు బాల్ రెడ్డి, దశరథ్ రెడ్డి, వెంకట్ రెడ్డి ఆదర్శ్ రెడ్డి, విజయభాస్కర్ రెడ్డి, వెంకటేష్ గౌడ్, అంజయ్య యాదవ్, పరమేష్ యాదవ్, షేక్ హుస్సేన్, నాయికోటి రాజేష్, పాండు, మహమ్మద్ అఫ్జల్, బూన్, హశం, ఆయా గ్రామాల ఎంపీటీసీలు, కౌన్సిలర్లు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# ఫ్లెక్సీలు తొలగిస్తున్న అధికారులు

- ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున రాజకీయ ఫ్లెక్సీలను స్వచ్ఛందంగా తొలగించండి
- పినపాక ఎంపీఓ వెంకటేశ్వరరావు




**పినపాక, విశాలభారతి :**

పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో పినపాక నియోజకవర్గం పినపాక మండలంలో రాజకీయ నాయకుల ఫ్లెక్సీలు ఎంపీవో వెంకటేశ్వరరావు స్వయంగా తొలగిస్తున్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ పినపాక మండలంలోని 23 గ్రామ పంచాయతీల పరిధిలో రాజకీయ నాయకుల ఫ్లెక్సీలను వెంటనే తొలగించాలని ఆదేశించారు . ఫ్లెక్సీలు స్వచ్ఛందంగా తొలిగించి సహకరించాలని కోరారు. ఎన్నికల కోడ్ నియమ నిబంధనలు పాటించాలన్నారు . లేకపోతే చట్టపరమైన చర్యలు తప్పమన్నారు . ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జక్కుల అశోక్, కృష్ణమూర్తి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# కవిత అరెస్ట్ ముమ్మాటికీ రాజకీయ కుట్ర

## బిఆర్ ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ తుంగబాలు



**సికింద్రాబాద్, విశాలభారతి:**

బిఆర్ఎస్ సీనియర్ నాయకురాలు ఎమ్మెల్సీ కవిత అక్రమ అరెస్టును ఖండిస్తూ శనివారం ఓయూ ఆర్ట్స్ కళాశాల ఎదుట కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను బిఆర్ఎస్ విద్యార్థి విభాగం నాయకులు దహనం చేశారు. అనంతరం తుంగ బాలు మాట్లాడుతూ లోక్ సభ ఎన్నికలలో బిఆర్ఎస్ పార్టీని బలహీన పర్చాలని కాంగ్రెస్,బీజేపీ కలసి చేసిన కుట్ర చేస్తున్నాయని ఆరోపించారు. ఆడబిడ్డని చూడకుండా ముందస్తు సమాచారం లేకుండా ఒక తీవ్రవాదిని, దేశద్రోహిని అరెస్టు చేసినట్లు ఒక ప్రజా ప్రతినిధిని అరెస్టు చేయడం ప్రజాస్వామ్యంలో చీకటి రోజని అన్నారు. రాజకీయ ప్రత్యర్థులను దెబ్బతీసేందుకు మోడీ సర్కార్ కుట్రలు చేస్తోంది అన్నారు.బిజెపిలో చేరితే కేసులు రద్దు చేస్తున్నారు...లేకపోతే వేధిస్తున్నారు. రాజకీయ ప్రత్యర్థుల్ని లొంగదీసుకునేందుకు బిజెపి ఇలాంటి చర్యలకు పాల్పడుతుందని బాలు ఆరోపించారు. అనేక రాజకీయ పార్టీలను ఇలాగే లొంగదీసుకుని తమ పార్టీలో జాయిన్ చేసుకున్నారు. బిజెపికి ఎదురు నిలబడింది దేశంలో కేసీఆర్ ఒక్కరే కవిత నిర్దోషిగా బయటికి వస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# సైబర్ నేరాలపై అవగాహన అవసరం

## శంకర్‌పల్లి డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ నాగరాజు




**శంకర్‌పల్లి, విశాలభారతి:**

సైబర్ నేరాల పట్ల ప్రజలు, విద్యార్థులు, యువత పూర్తిగా అవగాహన కలిగి ఉండి, తగు జాగ్రత్తలు తీసుకోవాలని శంకర్పల్లి డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ నాగరాజు అన్నారు. శనివారం స్థానిక రైల్వే స్టేషన్ ఆవరణలో ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. డిఐ మాట్లాడుతూ ప్రజలు తమ వ్యక్తిగత, బ్యాంకింగ్ వివరాలు అపరిచితులతో పంచుకోవద్దని సూచించారు. ఫోన్ లలో ఓటీపీ, ఓఎల్ఎక్స్, పేటీఎం, గూగుల్ పే, ఫోన్ పే, కేవైసీలను అప్డేట్ చేయమని వచ్చే మెసేజ్లకు స్పందించకూడదన్నారు. సైబర్ నేరాలకు గురైనప్పుడు 1930 టోల్ ఫ్రీ నంబర్ కు డయల్ చేయాలన్నారు. సైబర్ క్రైమ్ కు గురైన వెంటనే ఫిర్యాదు చేస్తే డబ్బులు రికవరీ చేసే అవకాశం ఉంటుందని అన్నారు. ఇటీవల కాలంలో మహిళలు, పిల్లలను టార్గెట్ చేసుకుని సైబర్ నేరాలు పెరుగుతున్నాయన్నారు. ఇంటర్నెట్ ను పరిమితికి మించి వాడకూడదని సూచించారు. సైబర్ నేరగాళ్లు రోజుకో రీతిలో ప్రజలను మోసం చేసి, డబ్బులు కాజేస్తున్నారన్నారు.

# అక్రమ ఇసుక రవాణా అరికట్టేందుకు చర్యలు

## భద్రాద్రి జిల్లా కలెక్టర్ ప్రియాంక అలా

**భద్రాద్రి, విశాలభారతి :**



డిస్టిక్ లెవెల్ సాండ్ కమిటీ ద్వారా ఇప్పటివరకు 9 ఇసుక రీచ్లకు అనుమతి ఇవ్వడం జరిగిందని రానున్న రెండు రోజుల్లో ఇంకో రెండు ఇసుక రీచ్లకు అనుమతి మంజూరు చేస్తామని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఇసుక కావలసినవారు మన ఇసుక వాహనం https://tsmiv.cgg.gov.in వెబ్సైట్ ద్వారా ఆన్లైన్లో బుక్ చేసుకోవాలని చెప్పారు. వినియోగదారుని ఫోన్ నెంబర్ ఓటిపి ద్వారా బుకింగ్ జరుగుతుందని, ఆన్లైన్ పేమెంట్ తదుపరి వినియోగదారుడుకి బుకింగ్ కి సంబంధించిన మెసేజ్ ఫోన్ కి వస్తుందని తమ యొక్క బుకింగ్ ట్రాకింగ్ చేసుకోవచ్చు అని కలెక్టర్ తెలిపారు. ఇసుక అక్రమ రవాణా అరికట్టేందుకు అన్ని రకాల చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఇసుకరీచుల్లో ఉదయం నుండి సాయంత్రం 6:00 వరకు మాత్రమే లోడింగ్ అనుమతి ఉంటుందని ఆమె తెలిపారు. ప్రతి ఈ రీచుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందని చెప్పారు. ఇసుక సంబంధించిన ఫిర్యాదులు మరియు సందేహాలను నివృత్తి కొరకు 08744 241950 హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయడం జరిగిందని కలెక్టర్ తెలిపారు.

# పొద్దుటూరులో బలపడుతున్న కాంగ్రెస్ పార్టీ

## కాంగ్రెస్ పార్టీలో చేరిన, బిఆర్ఎస్ నాయకులు



**శంకర్ పల్లి, విశాలభారతి:**

పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న వేళ, చేవెళ్ల పార్లమెంట్ పరిధిలో కాంగ్రెస్ పార్టీ గణనీయంగా పుంజుకుంటుంది, చేవెళ్ల అసెంబ్లీ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ పామెన భీమ్ భరత్ ఆధ్వర్యంలో పొద్దుటూరు బిఆర్ఎస్ నాయకులు శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి కె ఉదయ మోహన్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఏనుగు రవీందర్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జనార్ధన్ రెడ్డి, పొద్దుటూరు గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రంగా రెడ్డి సమక్షంలో, శనివారం పొద్దుటూరు గ్రామ బిఆర్ఎస్, కార్యకర్తలకు, పామెన భీమ్ భరత్ కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా భీమ్ భరత్ మాట్లాడుతూ, రాబోయే పార్లమెంట్ ఎన్నికలలో చేవెళ్ల పార్లమెంట్ స్థానాన్ని కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంటుందని, అందు కొరకు మనందరం కలిసికట్టుగా పనిచేయాలని, సూచించారు. మీకు ఎలాంటి సమస్యలు ఉన్న ఎల్లప్పుడు మీకు కాంగ్రెస్ పార్టీ తోడుగా ఉంటుందని, పార్టీ కార్యకర్తలను కాపాడుకునే పార్టీ అని భరోసా ఇచ్చాడు. కాంగ్రెస్ పార్టీలోకి మారిన వారిలో, నాని బుచ్చయ్య, నాని ఆనంద్, నాని తిరుపతి, నాని ప్రభాకర్, నాని మల్లేష్, నాని మహేష్ కుమార్, డప్పు బిక్షపతి, బూడుదుల సిద్ధార్థ, బూడిదల మాణిక్యం, బూడుదుల నరేందర్ లు ఉన్నారు. ఈ సందర్భంగా నాని బుచ్చయ్య మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, స్త్రీలకు ఉచిత బస్సు సౌకర్యం, 500 కే గ్యాస్ సిలిండర్, 10 లక్షల ఆరోగ్య శ్రీ కార్డు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు, నిరుద్యోగుల కోసం ఉద్యోగాలు తదితర గొప్పతనం చేపడుతున్నారని, ఇలాంటి గొప్ప సమయంలో మనందరం కాంగ్రెస్ పార్టీ వెంట ఉండి, సహకరిద్దామని, రాబోయే పార్లమెంట్ ఎన్నికలలో మన పొద్దుటూరు గ్రామం నుండి చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థికి అధిక మెజార్టీ వచ్చే లాగున కృషి చేద్దామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో, తెలంగాణ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి కె ఉదయ మోహన్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఏనుగు రవీందర్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జనార్దన్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ మహమ్మద్ ఎజాజ్, పొద్దుటూరు గ్రామ పార్టీ అధ్యక్షుడు రంగారెడ్డి, గ్రామ మహిళా సంఘం అధ్యక్షురాలు రంగమ్, ఏనుగు నరసింహారెడ్డి, రాజిరెడ్డి, దర్శన్, మందుమూల యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
GENERAL NEWS
జనరల్ న్యూస్
www.vishalabharati.com
epaper:vishalabharati.com
vishalabharathi Telugu Daily
6
ఆదివారం,
17.03.2024
హైదరాబాద్

గెలిపించేందుకు ప్రతి ఒక్కరు

# కృషి చేయాలి

## బిజెపి రాష్ట్ర నాయకులు పిలుపు



**మణుగూరు, విశాలభారతి :**

భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు రంగా కిరణ్ ఆదేశాల మేరకు పినపాక నియోజకవర్గ మహబూబాబాద్ పార్లమెంట్ ఎన్నికల సమావేశం శనివారం నాడు మణుగూరు పట్టణ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో మండల కమిటీలు బూత్ కమిటీలను పటిష్ఠం చేసి రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మహబూబాద్ పార్లమెంటు స్థానాన్ని అత్యధిక ఓట్ల మెజార్టీతో గెలిపించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరికి బిజెపి అండగా ఉంటుందని ప్రతి పేద కుటుంబానికి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పథకాలు ఎంతో ఉపయోగపడేలా ప్రతిష్టాత్మక చేపడుతున్నారని వారు తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జంపన సీతారామరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి తాటి పాముల ఐలయ్య, నియోజకవర్గ కన్వీనర్ పున్నం బిక్ష పతి, నియోజకవర్గ నాయకులు పోడియం బాలరాజు, జిల్లా ఉపాధ్యక్షులు బిజ్జం శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

కమ్మ కార్పొరేషన్ ఏర్పాటు

# అభినందనీయం



**నేరేడుచర్ల , విశాలభారతి:**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కమ్మ కార్పొరేషన్ ఏర్పాటు చేసి సంచలనాత్మక నిర్ణయం తీసుకొని వేద కమ్మ కులస్తులకు ప్రోత్సహించేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం అభినందనీయమని. రావులపల్లి ప్రసాద్, నాగండ్ల శ్రీధర్, సుంకర క్రాంతి కుమార్ లు అన్నారు. శనివారం నేరేడుచర్ల లో కాకతీయ కమ్మ సంఘం ఆధ్వర్యంలో నేరేడుచర్ల కమ్మ బంధువులు సమావేశం ఏర్పాటుచేసి తెలంగాణలో ఉన్న కమ్మ కులస్తుల కులంలో పెద్దవారే తప్ప ఆర్థికంగా వెనుకబడి ఉన్న పేదవారు ఎంతోమంది ఉన్నారని ఆ విషయాన్ని గుర్తించి రేవంత్ రెడ్డి ప్రభుత్వం కమ్మ కార్పొరేషన్ ఏర్పాటు చేసి వారి అభివృద్ధి కోసం అభ్యున్నతి కోసం పాటుపడే నిర్ణయం తీసుకోవడం ఆనందదాయకమని పార్టీలకతీతంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నామని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో కుంకు శ్రీనివాస్, అల్లు నాగభూషణం,యారవ సురేష్, చిట్టిబాబు, రవి, అరబండ కిరణ్, సుంకరి ప్రదీప్తి, నారాయణ, నాగండ్ల వెంకటేశ్వరరావు, తిరుపతమ్మ, సుబ్బారావు, పూర్ణ, శ్రీకాంత్, కుంకు మోహన్ రావు తదితరులు ఉన్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా

# సహకరించాలి




## ట్రైనీ ఐ.పీ.ఎస్ రాజేష్ మీనా

**సూర్యాపేట, విశాలభారతి:**

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా అందరూ సహకరించాలని ట్రైనీ ఐ.పీ.ఎస్ రాజేష్ మీనా అన్నారు. శనివారం సూర్యాపేట జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే ఉత్తర్వుల మేరకు పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా సూర్యాపేట రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎర్కారం, బాలెంల గ్రామాలలో సి.ఐ.ఎస్.ఎఫ్ సిబ్బంది, సివిల్ పోలీస్ సిబ్బంది కవాతు నిర్వహించినారు. ఈ సందర్భంగా ట్రైనీ ఐ.పీ.ఎస్ రాజేష్ మీనా మాట్లాడుతూ సూర్యాపేట మండలంలో పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ముందస్తు చర్యగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, గొడవలు జరగకుండా కవాతు నిర్వహించినట్లు తెలిపారు. పాత రాజకీయ గొడవలను దృష్టిలో ఉంచుకోని ఘర్షణలకు పోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట డిఎస్పి జి.రవి , సూర్యాపేట రూరల్ సి.ఐ వై. సురేందర్ రెడ్డి , రూరల్ ఎస్సై ఆర్. బాలు నాయక్, సర్కిల్ ఎస్సైలు సిబ్బంది పాల్గొన్నారు.

# రజాకార్ పై దర్శక మిత్రుల సంబరాలు

## సినిమా దర్శకుడు చిట్యాల వాసి సత్యనారాయణ



**చిట్యాల, విశాలభారతి:**

రజాకార్ సినిమా విడుదల సందర్భంగా చిట్యాలలో సినిమా దర్శకుడు యాట సత్యనారాయణ చిన్ననాటి స్నేహితులు ఆనందాన్ని వ్యక్తం చేస్తూ చిట్యాలలోని సుజనా టాకీస్ వద్ద హంగామా చేశారు. టపాసులు కాల్చి సంబరాలు చేశారు. చిట్యాల వాసి దర్శక స్థాయికి ఎదిగి ఒక గొప్ప సినిమా తీయడం ఆనందంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమం లో పోలిశెట్టి రాజు, ప్రొద్దుటూరు కిరణ్ కుమార్, చంద్రగిరి శంకర్, తోకల జంగారెడ్డి, అనిత, రామాంజనేయులు, తేరటుపల్లి శ్రీధర్, నర్సింహా, శ్రీను, అమరేందర్ రెడ్డి, విజయ సారథి, యాదయ్య, రాము, తుకారాం, రవి, నర్సింహ పలువురు ఉన్నారు.

# మతోన్మాదానికి వ్యతిరేకంగా ఉద్యమిద్దాం

## పివైఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి రవి, పిడిఎస్యు జిల్లా అధ్యక్షుడు పుల్లూరి సింహాద్రి



**కోదాడ, విశాలభారతి:**

భారత దేశం స్వాతంత్రం కోసం ఉరికంబాన్ని ముద్దాడిన విప్లవ యువ కిశోరాలు షహీద్ భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ ల 93వ వర్ధంతి సందర్భంగా పోస్టర్ ను కోదాడ పట్టణంలో పి డి ఎస్ యు పివైఎల్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పివైఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి రవి, పిడిఎస్యు జిల్లా అధ్యక్షుడు పుల్లూరి సింహాద్రి మాట్లాడుతూ దేశంలో మతోన్మాదం, ఫాసిజం రోజురోజుకీ పెరుగుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగ సమస్యను పరిష్కరించడంలో విఫలం అయ్యారని విమర్శించారు. కార్యక్రమంలో పివైఎల్ జిల్లా నాయకులు బాదె నాగరాజు, పిడిఎస్ యు జిల్లా నాయకులు వేణు, డివిజన్ నాయకులు యశ్వంత్, సిద్దు, శివ, భరత్, రాము, సైదులు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రారంభమైన

# వార్షిక బ్రహ్మోత్సవాలు



**చిట్యాల, విశాలభారతి:**

పెద్దకాపర్తి గ్రామంలోని స్వయంభు భూ సమేత తిరుమలనాథ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. అందులో భాగంగా శనివారం రోజు ధ్వజస్తంభ ప్రతిష్టా మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు కె. శ్రీనివాస శర్మ అర్చకతత్వంలో హోమం కార్యక్రమాన్ని నిర్వహించిన ధ్వజస్తంభాన్ని ప్రతిష్టించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ ఓర్సు రాజ్ కుమార్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.18 సోమవారం రోజు ఫలహార బండ్లు కార్యక్రమం, 19 మంగళవారం రోజు స్వామివారి కళ్యాణ మహోత్సవం నిర్వహించడం జరుగుతుందని ప్రజలందరూ అధిక సంఖ్యలో విచ్చేయాలని నిర్వహకులు కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసి చైర్మన్ కాటం వెంకటేశం, మాజీ సర్పంచ్ లు కందిమల్ల రేణుక శిషుపాల్ రెడ్డి,ఎంపిటిసి ముద్దసాని నీతా రమణారెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ ఎదుల్ల అజిత్ రెడ్డి, మాజీ సర్పంచ్ మర్రి జలంధర్ రెడ్డి, నీలకరం నరేష్, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు నీలకంఠం లింగస్వామి, తెల్సూరి సైదులు, అధికారులు, పలువురు నాయకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలి

## నూటికి నూరు శాతం ఫలితాలు సాధించాలి



**నడిగూడెం, విశాలభారతి:**

ఈ నెల 18వ తేదీ నుండి జరిగే పదో తరగతి పరీక్షలను మంచిగా రాసి నూటికి నూరు శాతం ఫలితాలు సాధించాలని ఎస్ ఐజి అజయ్ కుమార్అ న్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఎనుగుల వినయ్, పందిటి నవీన్ కుమార్, ఆధ్వర్యంలో పదో తరగతి చదువుతున్న విద్యార్థినిలకు పరీక్ష ఫ్యాడులను ఎస్సై చేతుల మీదగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మంచి మార్కులతో ఉత్తీర్ణులై పాఠశాలకు మీ తల్లిదండ్రులకు టీచర్స్ కు మంచి పేరు తేవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీస్ స్టేషన్ సిబ్బంది భాస్కర్ పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు శ్రీకళ ఏనుగుల వినయ్, పందిటి నవీన్ కుమార్ పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బిజెపి, బీఆర్ఎస్ ల మ్యాచ్ ఫిక్సింగ్ లో

# భాగమే కవిత అరెస్ట్

## మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి



**నడిగూడెం, విశాలభారతి:**

బిజెపి బిఆర్ఎస్ ల మ్యాచ్ ఫిక్సింగ్ లో భాగంగానే ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ను అరెస్టు చేశారని మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి వేపూరి సుధీర్ అన్నారు.శనివారం మండల కేంద్రంలో పాత్రికేయులతో ఆయన మాట్లాడుతూ వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో రెండు పార్టీలు మ్యాచ్ ఫిక్సింగ్ చేసుకొని ఎన్నికల్లో లబ్ధి పొందటానికి ఎన్నికల ముందు కవిత ను అరెస్టు చేశారని వారి మ్యాచ్ ఫిక్సింగ్ ను తెలంగాణ ప్రజలు నమ్మరన్నారు. ఆ రెండు పార్టీలు గత పది ఏళ్లుగా అంతర్గత ఒప్పందంతో పనిచేస్తున్నాయని. రెండు పార్టీలు ఒకటేనని గ్రహించిన తెలంగాణ ప్రజలు అసెంబ్లీ ఎన్నికల్లో వారికి తగిన గుణపాఠం చెప్పి తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వాన్ని ఎన్నుకున్నారన్నారు. తెలంగాణ ప్రజా ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు అమలుతో ప్రజలు ఇప్పుడే సంతోషంగా ఉన్నారని వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో తెలం గాణలో కాంగ్రెస్ పార్టీ 12 కు పైగా ఎంపి స్థానాలు గెలుచుకుంటుందని దీమా వ్యక్తం చేశారు. ఇరిగేషన్, పౌరసరఫరాల శాఖా మాత్యులు నలమాద ఉత్తంకుమార్ రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డిల నాయకత్వంలో నియోజవర్గం పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందుతుందని తెలిపారు. వారితో పాటు పాత్రికేయుల సమావేశంలో గంటెపంగు విజయ్, దున్న శ్రీకాంత్,దున్న దినేష్ మేరీగా శ్రీరామ్, కొత్తపల్లి వంశీ, పందిటి వంశీ,పందిటి శ్యామ్, దున్న రాజా తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుని

# కన్నీటి గాధ

## వెట్టి చాకిరి చేయించుకుని వదిలేసిన మునిసిపాలిటీ అధికారులు




**మణుగూరు, విశాలభారతి :**

మణుగూరు మున్సిపాలిటీ అధికారుల స్వార్థంతో వారి అధికార దాహంతో ఒక పారిశుద్ధ్య కార్మికుడి జీవితం రోడ్డున పడింది. మున్సిపాలిటీ అధికారులు పారిశుద్ధ్య కార్మికునితో పని చేయించుకుని అతను చేసిన పనికి దానికి తగిన జీతం ఇవ్వకపోగా ఒక సంవత్సరం నుంచి అధికారుల చుట్టూ కాళ్ళు అరిగేలా తిరిగినా అతనికి ఫలితం లేకుండా పోయింది, చివరగా మున్సిపాలిటీ అధికారులు పట్టించుకోవడం లేదని మణుగూరు పోలీస్ అధికారులకు చెప్పినా కూడా వారు పట్టించుకోవడంలేదని విశాల భారతిని సంప్రదించి అతని బాధను చెప్పుకున్నాడు. బాధితుడు చెప్పిన వివరాల ప్రకారం మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని విటల్ రావు నగర్ గ్రామానికి చెందిన మందకృష్ణ తండ్రి సాయిలు, తేదీ 0202 2020 మున్సిపాలిటీలో పరిశుద్ధ కార్మికునిగా చేరి 19.2.2021 వరకు పని చేశాను, 2020వ సంవత్సరంలో వెంకటస్వామి కమిషనర్ గా ఉన్న కాలంలో నాకు నెలకు 12 వేల రూపాయల జీతం నిర్ధారించి నమ్మబలికి ఆరు నెలల తర్వాత నెలకు 6000 రూపాయల చొప్పున ఇచ్చారు. మొత్తం సంవత్సర కాలంగా నేను పనిచేయగా ఏడు నెలల జీతం మాత్రమే ఇచ్చారు. మిగతా ఇది నెలల జీతం ఇవ్వకపోగా మున్సిపాలిటీ కమిషనర్ తో పాటు అధికారులంతా కూడా నన్ను మభ్యపెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

# రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



## బాణాల కవిత నాగరాజ్

**నడిగూడెం, విశాలభారతి:**

కోదాడ అభివృద్ధి ప్రదాత ఎమ్మెల్యే నలమాద ఉత్తమ్ పద్మావతి, జడ్పిటిసి బాణాల కవిత నాగరాజు ల నిధులతో చేపట్టిన సిసి రోడ్ నిర్మాణ పనులను జెడ్పిటిసి బాణాల కవిత నాగరాజు, ఎంపీటీసీ గుండు శ్రీనివాస్ తో కలిసి ప్రారంభించారు. శనివారం మండల కేంద్రంలో గల కస్తూరిబా గాంధీ పాఠశాల నుండి ప్రధాన రహదారి పోలీస్ స్టేషన్ వరకు చేపట్టే సిసి రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ ఎంపీటీసీ వెంకటరెడ్డి కాసాని వెంకన్న గుండు విజయ రామారావు, నాగవరపు రాము కాసాని శివ కృష్ణ,పల్లపు తిరుమలి, గుంజ తిరుమలేశు బాణాల సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# రహదారి పనులు ప్రారంభం



**మునగాల, విశాలభారతి:**

మునగాల మండల పరిధిలో తిమ్మారెడ్డి గూడెం నుండి పెన్ పహాడ్ మండలం చెట్ల ముకుందపురం వరకు బిటి రోడ్ నిర్మాణ పనులను ఎంపీపీ యలక బిందు నరేందర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎలుక బిందు నరేందర్ రెడ్డి మాట్లాడుతూ తిమ్మారెడ్డి గూడెం నుండి చెట్ల ముకుందాపురం వరకు వెళే రహదారి గుంతలమయంతో ప్రజలకు ఇబ్బందులు గురవుతున్న క్రమంలో ఎన్నో రోజులు ఉద్యమాల ఫలితంగా రోడ్డు పనులకు నిధులు మంజూరు అయినట్లు తెలిపారు. 2కోట్ల రూపాయలు డిఎంఎఫ్టి నిధుల నుండి మంజూరైనట్లు తెలిపారు. రోడ్డు నిర్మాణ పనులను నాణ్యత ప్రమాణాలు పాటించి త్వరలో పూర్తి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమములో వైస్ ఎంపీపీ బుచ్చి పాపయ్య, ఎంపీడీవో రమేష్ దీన్ దయాళ్, పంచాయతీ రాజ్ డిఈ సాయి హర్ష, ఏఈ రాము, రంగారావు, తిమ్మారెడ్డి గూడెం మాజీ సర్పంచ్ బూసిపల్లి శ్రీనివాసరెడ్డి, ప్రజా ప్రతినిధులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఈ కెవైసి తప్పక అప్ డేట్ చేసుకోవాలి

**● వ్యాపారస్తులు రెసిడెన్సిల్ సిలెండర్ వినియోగించవద్దు**

**● అదనపు కలెక్టర్ రెవెన్యూ బి.ఎల్. లత**



**సూర్యాపేట, విశాలభారతి:** జిల్లాలో గ్యాస్ ఉన్న ప్రతి ఒక్కరు ఈ కెవైసి అప్ డేట్ తప్పక చేయించుకోవాలని అదనపు కలెక్టర్ బి.ఎస్. లత సూచించారు. కలెక్టరేట్ లోని గ్యాస్ డీలర్స్, సంబంధిత శాఖల అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ వ్యాపారస్తులు కమర్షియల్ సిలెండర్ మాత్రమే వాడాలని సూచించారు.గ్యాస్ అందించుటలో వినియోగదారులకు మెరుగైన సేవాలందించాలని, గ్యాస్ బాయ్స్ తో ఇబ్బందులు ఎక్కడ రాకుండా డీలర్లు, సంబంధిత అధికారులు చూడాలని అన్నారు. ఒక సంవత్సరానికి వినియోగదారులు 12 వరకు వినియోగించుకోవచ్చని, అలాగే హోటల్స్ , వ్యాపారస్తులు, రెసిడెన్సిల్ సిలెండర్ వాడితే చర్యలు తీసుకుంటామని సూచించారు. ఈ సమావేశంలో డి.ఎస్.ఓ మోహన్ బాబు, అసోషియేషన్ అధ్యక్షురాలు కొటేశ్వరి, వివిధ కంపెనీల గ్యాస్ డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

## మాదిగలను విస్మరిస్తున్న కేంద్ర ప్రభుత్వం

**మాదిగ జేపీసీ చైర్మన్ పిడమర్తి రవి**



**సూర్యాపేట, విశాలభారతి:** కేంద్ర ప్రభుత్వం మాదిగలని ఏబిసిడి వర్గీకరణ పేరుతో మాదిగల విస్మరిస్తుందని వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో బిజెపి పార్టీ ని ఓడించాలని మాదిగ జేఏసీ చైర్మన్ మాజీ ఎస్సీ కార్పొరేషన్ తొలి చైర్మన్ పిడమర్తి రవి అన్నారు. జిల్లా కేంద్రంలోని పబ్లిక్ క్లబ్ లో మాదిగల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం శనివారం మాదిగ జేఏసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కొండమీద గోవిందరావు అధ్యక్షతన జరిగింది. సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పది సంవత్సరాలుగా ఎస్సీ వర్గీకరణ చేయకుండా అనేక కమిటీల పేరుతో కాలయాపన చేస్తూ మాదిగలను అన్ని రంగాల్లో ఎదగనీయకుండా చేసిందని విమర్శించారు. మాదిగలకు జనాభా దామాషా ప్రకారం విద్య, వైద్య, రంగాల్లో రిజర్వేషన్ సౌకర్యం కల్పించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సూచించారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో మాదిగలు సత్తా చూపాలని పిలుపునిచ్చారు. మాదిగలంతా తమ హక్కుల సాధనకై ఐక్యంగా ఉద్యమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాదిగ జర్నలిస్టుల జేఏసీ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు బొజ్జ ఎడ్వర్డ్, యూత్ జేఏసీ జిల్లా అధ్యక్షుడు బొజ్జ సంజయ్, మాదిగ జేఏసీ సూర్యాపేట నియోజకవర్గ అధ్యక్షుడు జెఫన్యా, యూత్ అధ్యక్షులు బెజవాడ శ్రవణ్, కోదాడ అధ్యక్షుడు నూక పంగు ఈదయ్య, హుజుర్ నగర్ అధ్యక్షుడు రాం సైదులు తదితరులు పాల్గొన్నారు.



## వలస పాలకులను తరిమిన సింహ స్వప్నం భగత్ సింగ్

**నూతనకల్, విశాలభారతి:** వలస పాలకులను తరిమిన సింహ స్వప్నం భగత్ సింగ్ అని, ఐఎఫ్టియూ జిల్లా అధ్యక్షులు గంట నాగయ్య పిడిఎస్యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు గడ్డం శ్యామ్ అన్నారు.నూతనకల్ బిసి హాస్టల్ లో పిడిఎస్యూ సూర్యాపేట డివిజన్ అధ్యక్షులు పిడమర్తి భరత్ ఆధ్వర్యంలో భగత్ సింగ్, రాజ్ గురు , సుఖదేవ్ ల వర్థంతి సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గడ్డం శ్యామ్ పాల్గొని మాట్లాడుతూ బ్రిటిష్ వలస పాలకుల వెన్నులో వణుకుపుట్టించే వీర కిషోరం భగత్ సింగ్ అని పేర్కొన్నారు. నాడు భగత్ సింగ్ లాంటి సమరయోధులు పోరాటంతో వలస పాలకులను దేశం నుంచి తరిమితే నేడు స్వదేశీపాలకులు సామ్రాజ్యదేశాలతో ములాఖాత్ అయ్యి ప్రజలను వంచిస్తున్నారని పేర్కొన్నారు. కేంద్రంలోని నరేంద్రమోడీ ప్రజలను మతం,కులం పేరుతో విభజన,విద్వేష రాజకీయాలతో పబ్బం గడుపుతున్నారని అన్నారు. ఆకలి సూచీలో దేశం దిగజారిపోతుంటే అంబానీ , ఆదాని ఆస్తులు పెరుగుతున్నాయని వివరించారు. ఈ కార్యక్రమంలో సాయి, మహేష్, వేణు, గణేష్, సంపత్, తదితరులు పాల్గొన్నారు.

## అవినీతి బురదలో చిక్కుకున్న బిజెపి

**సిపిఐ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకటరెడ్డి**



**సూర్యాపేట, విశాలభారతి:** ఎలక్టోరల్ బాండ్ల వ్యవహారంలో బిజెపి పార్టీ అవినీతి బురదలో చిక్కుకుందని సిపిఐ జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకటరెడ్డి అన్నారు. శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో గల సిపిఐ కార్యాలయం ధర్మ బిక్షం భవన్ లో జరిగిన ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల ఫండ్ పేరుతో సాగించిన మనీ ల్యాండరింగ్ సహా సకల అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయని 100 కోట్ల రూపాయల టర్నోవర్ కూడా లేని కంపెనీ 200 కోట్లు ఫండ్ ఇచ్చినట్టు అసలు కంపెనీకి సొంత వెబ్సైట్ కూడా లేని వాళ్ళు 125 కోట్లు పండ్ ఇచ్చినట్లు, చివరకు ఏటా 330 కోట్లు నష్టాలు చూపుతున్న ఎయిర్టెల్ కంపెనీ బీజేపీకి 300 కోట్లు ఎలక్ట్రోల్ బాండ్లు చెల్లించినట్లు బయటపడిందని ఆయన అన్నారు. దేశంలో బిజెపితో పాటు అనేక పార్టీలు టిడిపి జనసేన టీఎంసి పార్టీలు కూడా అవినీతి బురదలో కూరుకుపోయాయని, దేశంలో అవినీతి లేని కళంకం లేని పార్టీలు ఏదైనా ఉంది అంటే అది కమ్యూనిస్టు పార్టీ మాత్రమే అని ఆయన సగర్వంగా ప్రకటించారు. దేశంలో అన్ని పార్టీలు కార్పొరేట్ స్వామ్యానికి దాసోహం అన్న ఈ దశలో సైతం తమ విధానాలకు అనుకూలంగా నిలబడి చిత్తశుద్ధి సాటిన వామపక్షాల ఘనతను జనం గుర్తించాల్సిన అవసరం ఉందని అన్నారు. బిజెపి సర్కార్ తమలక్ష్యాలను సాధించుకోవడం కోసం ప్రజలలో భావోద్వేగాలు రెచ్చగొడుతున్నదని సిఏఏ మరియు ఎన్ ఆర్ సి లాంటివి ఈకోవ కిందికి వస్తాయని ప్రజల మధ్య మత విద్వేషాలు రెచ్చగొట్టి ఇది నా మతం అనే పరిస్థితుల్లోకి ప్రజలు నెట్టివేయబడ్డారని, ఇది అత్యంత ప్రమాదకరమని ఆయన అన్నారు. సమావేశానికి ఉస్తెల నారాయణరెడ్డి అధ్యక్షత వహించగా సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ధూళిపాళ ధనుంజయ నాయుడు, యల్లావుల రాములు, మేకల శ్రీనివాసరావు, యల్లంల కంబాల శ్రీనివాస్, పోకల వెంకటేశ్వర్లు, దేవరం మల్లీశ్వరి, బూరవెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## చట్టాలకు తూట్లు పొడుస్తున్న అధికారులు

**నిబంధనలకు విరుద్ధంగా భూ బదలాయింపు తగదు ● బొలగాని పరదేశి**



**బయ్యారం, విశాలభారతి:** బయ్యారం మండల పరిధిలో ఏజెన్సీ చట్టాలకు విరుద్ధంగా గిరిజనేతరులు కొందరు వారి స్వార్థ ప్రయోజనాల కోసం ప్రభుత్వ రంగంలో కొందరి అధికారుల సహకారంతో భూ బదలాయింపులు గోప్యంగా చేసుకున్నారని సమాచార హక్కు చట్టం ద్వారా వాటి వివరాలు ఇవ్వాలని మండల కేంద్రానికి చెందిన గిరిజనేతరుడు బొలగాని పరదేశి తహసీల్దార్ ని కోరడం జరిగింది. ఇందులోని సారాంశాన్ని చూస్తే గిరిజనుల భూములు క్రయవిక్రయాలు చేయాలంటే అది గిరిజనుల మద్యే జరగాలని, గతంలో 1959 యాక్ట్ పరిధిలో గిరిజనేతరులు భూమి పట్టాలు పొంది ఉన్నట్లయితే వారసత్వ కింది హక్కు దారుడు మరణాంతరం ఆ ప్రక్రియ వర్తిస్తుందని వారి అభిప్రాయం. ఈ చట్టం వచ్చి చాలా సంవత్సరాలు పూర్తి అయింది. కానీ అమలు మాత్రం ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నట్టుగా ఉంది. ఈ చట్టం వల్ల గిరిజనుల భూములు, 1963 కంటే ముందు నుంచి స్థానికంగా ఉండి భూమి హక్కులు కలిగిన గిరిజనేత భూములు కూడా కాపాడబడతాయి. 1959లో ఈ భూ బదలాయింపులు నిబంధనలు చేశారు.



## ఎమ్మెల్సీ కవిత అక్రమంగా అరెస్ట్ చేశారు

**ప్రధాని మోడీ ఎన్ని కుట్రలు పండిన వెనకడుగు వేసేది లేదు**

**సూర్యాపేట, విశాలభారతి:** పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో బిఆర్ఎస్ పార్టీని బలహీనపరిచేందుకు నాయకులను, కార్యకర్తలను భయభ్రాంతులకు గురి చేసేందుకు కాంగ్రెస్, బిజెపిలు ఒకటై ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను అరెస్టు చేయడం దుర్మార్గమని యావత్ తెలంగాణ దీన్ని తీవ్రంగా ఖండిస్తుందని సూర్యాపేట మున్సిపల్ చైర్పర్సన్ పెరుమాళ్ళ అన్నపూర్ణ శ్రీనివాస్, మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్ లు అన్నారు. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను అరెస్టు చేయడం పట్ల తీవ్ర నిరసన వ్యక్తం చేస్తూ శనివారం తెలంగాణ తల్లి విగ్రహం వద్ద బిఆర్ఎస్ శ్రేణులు భారీ ఎత్తున రాసారోకో నిర్వహించి మాట్లాడారు. పకడ్బందీ ప్లాన్ తో బిజెపి కాంగ్రెస్ లు ఒకటై ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను అరెస్టు చేయడం జరిగిందన్నారు. తెలంగాణ ఉద్యమంలో ఎంతో మంది మహిళలను చైతన్యపరిచిన కవితను అరెస్టు చేయడం ఏమిటని ప్రశ్నించారు. ప్రధాని మోడీ కాంగ్రెస్ తో కలసి ఎన్ని పన్నాగాలు పన్నినా వెనకడుగు వేసేది లేదనీ భయపడే ప్రసక్తే లేదని టిఆర్ఎస్ ఉద్యమ పార్టీ అని మేమంతా ప్రాణ త్యాగాలకు కూడా సిద్ధమన్నారు. కాంగ్రెస్ ఆచరణకు సాధ్యం కానీ హామీలతో అధికారంలోకి వచ్చి ప్రజలను మోసం చేసి నడిరోడ్డున పడేసారన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణను బంగారు తెలంగాణగా మార్చిన విషయాని గుర్తు చేశారు. కాంగ్రెస్ ఏమి చేయలేక మోడీతో చేతులు కలిపి దొంగ నాటకాలు ఆడుతూ కుట్రలు చేస్తుందని ఆరోపించారు. గతంలో ఎలాంటి కేసులతో కవితకు సంబంధం లేదని చెప్పి నేడు అరెస్టు చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఢిల్లీ నుంచి వచ్చిన ఈడి అధికారులకు కాంగ్రెస్ ప్రభుత్వం సహకరించిందని ట్రాఫిక్కు క్లియరెన్స్ చేయడం హుటాహుటిన ఢిల్లీకి తరలించడం వెనుక కాంగ్రెస్ కుట్ర దాగి ఉందన్నారు. కాంగ్రెస్ కుట్రపూరితంగా ఎమ్మెల్యేలు మాజీ ఎమ్మెల్యేలపై కేసులు పెడుతూ ఈ డి ఐ టి దాడులను చేయిస్తూ టిఆర్ఎస్ ను ఖతం పెట్టాలని చూస్తుందన్నారు. టిఆర్ఎస్ ఎవరికి లొంగదని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను విడుదల చేసే వరకు పోరాటం కొనసాగిస్తామని కాంగ్రెస్ బిజెపిల కుట్రలను ఎదుర్కొంటామని భవిష్యత్తులో టిఆర్ఎస్ నాయకులపై ఎలాంటి కుట్రలు చేసిన తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పుట్ట కిషోర్, జడ్పిటిసి జిడి బిక్షం, సూర్యాపేట టిఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి బూర బాల సైదులు, టిఆర్ఎస్ పార్టీ నాయకులు సుంకరి రమేష్, ఆకుల లవకుశ, బంటు చొక్కాయ తదితరులు పాల్గొన్నారు.

## పరీక్ష కేంద్రాలు పరిశీలన



మండల కేంద్రంతో పాటు మామిళ్ళ గూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లను సందర్శించి పాఠశాలలో ఉన్న సౌకర్యాలు పరిశీలించారు అనంతరం తహశీల్దార్ సంఘ మిత్ర మాట్లాడుతూ ఈ నెల 18 వ తేదీ నుంచి పదవ తరగతి పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని పరీక్షల సమయంలో ఎలాంటి మాస్ కాపీ కి అవకాశం లేకుండా తగు జాగ్రత్తలు పాటించాలని పాఠశాల సిబ్బందిని ఆదేశించారు. పరీక్షలలో మామిళ్ళగూడెం సెంటర్లో 83 మంది మోతె సెంటర్లో 108 మంది విద్యార్థిని విద్యార్థులు పరీక్షలు రాయబోతున్నారని పరీక్ష కేంద్రాలలో మంచినీటి సౌకర్యం, ప్రతి గది కి వెంటిలేషన్, సీసీ కెమెరాల ఏర్పాటును అధికారులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. బాలికలను చెక్ చేయుటకు మహిళ సిబ్బందిని ఏర్పాటు చేయాలని, గంట ముందు ప్రతి ఇన్విజిలేటర్ సెంటర్ కి రావాలని మొబైల్ ఫోన్ లను సెంటర్ లోకి అనుమతించేది లేదని అధికారులు సెంటర్ చీఫ్ లకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అధికారి హరిసింగ్, మండల విద్యాధికారి గోపాల్ రావు, మామిళ్ళగూడెం సెంటర్ చీఫ్ శ్రీనివాస్, మోతె సెంటర్ చీఫ్ సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



## పబ్లిక్ టాయిలెట్స్ ఏర్పాటు చేయండి

**కంపు కొడుతున్న వివిధ అడ్డాలు ● అసౌకర్యానికి గురవుతున్న భక్తులు**

**భద్రాచలం,విశాలభారతి:** పట్టణం లోని వివిధ సెంటర్లోని ఆటో స్టాండ్లు, కారుల అడ్డాల వద్ద బస్టాండ్ ఆవరణలో మొదలుకొని రాముల వారి గుడి ఏరియా భద్రాచలం నలుమూలల వస్తున్న భక్తుల కు. పబ్లిక్ టాయిలెట్స్ లేకపోవడం వలన అనేక కాలి ప్రదేశాలలో మూత్ర విసర్జన చేయడం వలన భద్రాచలం ప్రజలు నిలబడేందుకు కూడా వీలుగా లేనంతగా దుర్వాసనతో కంపు కొడుతూ ఉందని స్థానిక ప్రజలు భక్తులు ఆవేదన చెందారు. మహిళలకు ప్రత్యేకించి పబ్లిక్ టాయిలెట్స్ లేనందున భద్రాచలంలో భక్తులకు వివిధ ప్రాంతాలనుంచి వస్తున్న ప్రయాణికులకు తీవ్రమైన ఇబ్బందులకు గురవుతున్నారని యాత్రికులు వాపోతున్నారు. భద్రాచలం పట్టణం అనేక గ్రామాలకు వర్తక సముదాయం కలిగిన ప్రాంతం కావడం వలన ఇక్కడకు అనేకమంది వివిధ వస్తువుల కొనుగోలు నిమిత్తం అట్లాగే మెరుగైన వైద్యం చేసుకునేందుకు ఈ ప్రాంతానికి అధిక శాతం ప్రజానీకం వస్తూ ఉంటారు. అంతేకాకుండా భక్తులు రాములోరి గుడికి దర్శనార్థం వస్తుంటారు వీరికి స్థానికంగా వివిధ రకాల స్టాండ్లలో కార్మికులు మూత్ర విసర్జన చేసేందుకు కాలి ప్రదేశాలను ఎంచుకొని మూత్రం పోయాల్సిన దుస్థితి నెలకొందని వారు అంటున్నారు తక్షణమే భద్రాచలం ప్రాంతంలోని ప్రధాన సెంటర్లలో పబ్లిక్ టాయిలెట్స్ ఏర్పాటు చేయాలని భద్రాచలం పట్టణం మూత్ర విసర్జనతో కంపు కొడుతున్న దుస్థితి నుండి కాపాడాలని కోరుతున్నారు.

## సీఎం సహాయనిధి నిరుపేదలకు వరం

**ఎమ్మెల్యే వేముల ఆర్థిక భరోసాగా సీఎం సహాయ నిధి**

**సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ చేసిన ఎమ్మెల్యే**



**నకిరేకల్, విశాలభారతి:** నిరుపేదలకు గొప్ప వరంలా సీఎం సహాయనిధి పథకం ఉందని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. నకిరేకల్ పన్నాలగూడెం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియెజకవర్గ పరిధిలోని 44 మందికి మంజూరైన 17,లక్షల 32 వేల విలువగల సీఎం సహాయ నిధి చెక్కులను భాదితులకు అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం సహాయ నిధి పేదలకు వరంగా నిలుస్తుందని ఆరోగ్య శ్రీ పరిధిలోనికి రాని వైద్య చికిత్సలు చేయించుకున్న వారి ఇబ్బందులను తొలగించడానికి రాష్ట్ర ప్రభుత్వం సిఎం రిలీఫ్ ఫండ్ ద్వారా అండగా నిలుస్తుందన్నారు. ఈ ఆర్థిక సహాయం ద్వారా పేద ప్రజల ఇబ్బందులు దూరం అవుతాయని తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా అభివృద్ధి సంక్షేమ పథకాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెడుతూ రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పూజర్ల శంభయ్య, చిట్యాల మండల కాంగ్రెస్ అధ్యక్షులు లక్ష్మీ నరసింహ, అయా గ్రామాల సర్పంచులు ఎంపిటిసిలు వివిధ హోదాలలో ఉన్న నాయకులు పాల్గొన్నారు.

## కార్మికుల సమగ్ర చట్టం కై పోరాడుదాం

**ఐఎఫ్టియు రాష్ట్ర సహాయ కార్యదర్శి శివారపు శ్రీధర్**




**కేసముద్రం, విశాలభారతి:** తెలంగాణ హమాలీ అండ్ మిల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివారపు శ్రీధర్, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు గుజ్జు దేవేందర్ ల సమక్షంలో 25 మంది హమాలి కార్మికులు ఐఎఫ్టియు లో చేరారు. అనంతరం జరిగిన సమావేశం తెలంగాణ హమాలీ అండ్ మిల్ వర్కర్స్ యూనియన్ ఐఎఫ్టియు కేసముద్రం పట్టణ అధ్యక్ష కార్యదర్శులు మిట్టగడుపుల వెంకన్న, బండి రాజుల అధ్యక్షతన శివారపు శ్రీధర్ గుజ్జు దేవేందర్ లు మాట్లాడుతూ.. కార్మిక హక్కుల కార్మిక హక్కుల సాధనలో ఐఎఫ్టియు కేసముద్రం పారిశ్రామిక ప్రాంతంలో గత 30 సంవత్సరాలుగా కార్మికుల హక్కులకై చేస్తున్నటువంటి పోరాటాలకు ఆకర్షితులై ఐఎఫ్టియు లో చేరడం శుభపరిణామం అని వారి హక్కుల కోసం ఐఎఫ్టియు నిరంతరం పోరాటం నిర్వహిస్తుందని ఐఎఫ్టియు హక్కులకై ఎంత నిబద్ధత కొట్లాడుతుందో బాధ్యతల పట్ల కూడా అంతే నిబద్ధత ఉంటుందని అన్నారు. అసంఘటితరంగా కార్మికులనా హమాలి కూలి కార్మికులకు సమగ్ర చట్టం కై ఐక్యంగా ఉద్యమించాలని హమాలి కూలీలకు సంక్షేమ బోర్డు పిఎఫ్ ఈఎస్ఐ సాధనకై ఉద్యమించాలని వారన్నారు. కేసముద్రం పారిశ్రామిక ప్రాంతంలో ఓకే యూనిట్ కేంద్రంగా కార్మికులు అందరికీ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని, అర్హులైన వారికి రేషన్ కార్డులు పెన్షన్లు ఇవ్వాలని 50 సంవత్సరాలు నిండిన హమాలీ కూలి కార్మికులకు 5000 పెన్షన్ ఇవ్వాలని వారి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు కట్ల నాగరాజు, ఎస్కే రహిమాన్, సకినాల ఐలయ్య, తోపాటు చేరిన వారు ఎండి జిలాని పాల్గొన్నారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక

GENERAL NEWS
జనరల్ న్యూస్
vishalabharathi Telugu Daily
www.vishalabharati.com
epaper:vishalabharati.com


ఆదివారం, 17.03.2024 | హైదరాబాద్

## కళ్యాణ లక్ష్మి చెక్కు అందజేసిన ఎమ్మెల్యే



**బయ్యారం, విశాలభారతి:** ద్విచక్ర వాహనంపై తిరుగుతూ కళ్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేసిన ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, బయ్యారం మండల లోని గంధంపల్లి, కొత్తపేట గ్రామంలో లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి చెక్కులను స్వయంగా వారి ఇంటికి వెళ్లి పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ చైర్మన్ మూల మధుకర్ రెడ్డి, జిల్లాకార్యదర్శి భూక్య ప్రవీణ్ నాయక్, తిరుమల ప్రభాకర్ రెడ్డి, వేల్పుల శ్రీనివాస్, రాంమ్మూర్తి, రాంబాబు, సురేష్, పుల్లయ్య, కృష్ణ శ్రీను, అన్నపూర్ణ, సాయికృష్ణ, ఆవిరినేని వెంకటేశ్వరరావు, పుల్లూరి బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

## చట్టం ఎవరికి చుట్టం కాదు

### ఎమ్మెల్సీ కవిత అరెస్టుపై ఎంపీ అరవింద్ విలేకరుల సమావేశం

### ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి హిందూ వ్యతిరేకి



**ఆర్మూర్, విశాలభారతి:** చట్టాలు ఎవరికి చుట్టము కాదని వాటి పని అవి చేసుకుంటాయని ఎంపీ ధర్మపురి అరవింద్ అన్నారు శనివారం ఆర్మూర్ పట్టణ కేంద్రంలో బిజెపి కార్యాలయంలో అరవింద్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి హిందూ వ్యతిరేక గా మారాడు అని అన్నారు శుక్రవారం అని చూడకుండా ఆడపడుచును (ఈడీ) అరెస్టు చేసి తీసుకెళ్లారని బిఆర్ఎస్ నేతలు అనడంతో శుక్రవారం నాడే లిక్కర్ స్కాంచేశారని గుర్తు చేశారు లిక్కర్ స్కాం కు పాల్పడేటప్పుడు శుక్రవారం అని గుర్తు రాలేదా అని ఎద్దేవా చేశారు గతంలో ఎమ్మెల్సీ కవిత అరవింద్ ను ఉద్దేశించి ఎక్కడి నుండి పోటీ చేసిన ఓడిస్తానని శపథం చేశారని విలేకరులు గుర్తు చేయగా జైలు నుంచి నామినేషన్ వేసి నన్ను ఓడిస్తుందని చమత్కరించారు. దేశంలో అవినీతి రహిత పరిపాలన అందించాలంటే మోడీని మరోసారి గెలిపించాలని సూచించారు మోడీ పాలనే దేశానికి శ్రీరామరక్ష అని అన్నారు ఈ విలేకరుల సమావేశంలో నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ గుప్తా, బిజెపి జిల్లా అధ్యక్షులు దినేష్ కులచారి, కార్యవర్గ సభ్యులు ఏలేటి మల్లికార్జున్ రెడ్డి, నిజామాబాద్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ స్రవంతి రెడ్డి, పాలెపు రాజు, ఉప్పల శివరాజు తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందించాలి



**వనపర్తి, విశాలభారతి:** వనపర్తి జిల్లా ప్రభుత్వం ద్వారా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు పారదర్శకంగా అందించే విధంగా చూడాలని జిల్లా పరిషత్ ప్రాదేశిక సభ్యురాలు కాత్రావత్ లక్ష్మి అన్నారు. శనివారం జిల్లా కార్యాలయం జడ్పి సి. ఈ. ఒ చాంబర్ లో 6వ స్థాయి సంఘ సమావేశం నిర్వహించగా పానగల్ జడ్పీటిసి కే. లక్ష్మి అధ్యక్షత వహించారు. 6వ స్థాయి సంఘ సమావేశంలో జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి, బి.సి. సంక్షేమ శాఖ, గిరిజన అభివృద్ధి, మైనారిటీ సంక్షేమ శాఖ ల పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు మాట్లాడుతూ ప్రభుత్వం పేదలకు ఇస్తున్న సంక్షేమ పథకాలు పారదర్శకంగా అర్హులైన వారందరికీ అందేవిధంగా చూడాలని సూచించారు. జడ్పి సి. ఈ. ఒ యాదయ్య, కోఆప్షన్ సభ్యులు మునిరుద్దిన్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ పార్టీ నుండి భారీగా కాంగ్రెస్ లోకి చేరికలు



**బాల్కొండ,విశాలభారతి:** భీమ్‌గల్ మండలం పల్లికొండ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు 50 మంది బాల్కొండ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధిలో భాగస్వామ్యం కావడానికి,ముత్యాల సునీల్ కుమార్ ఆధ్వర్యంలో పనిచేయుటకు మేమంత కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు చేరినవారు తెలిపారు.చేరిన వారిలో అశోక్, చందు, రాజేశ్వర్,బద్రి,నవీన్ తదితరులు ఉన్నారు. భీమ్‌గల్ మండలం బడాభీంగల్ ఎంజీ తాండకి చెందిన మాజీ సర్పంచ్ రమేష్ ముత్యాల సునీల్ కుమార్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆయనతో పాటు నర్సయ్య,నరేష్,జీవన్, శ్రీనివాస్ తదితరులు చేరారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొదిరే స్వామి,జె జె నర్సయ్య, కుంట రమేష్, అనంతరావ్,కిరణ్,రాజేష్ కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## మహిళలు చదువులో రాణించాలి



**వనపర్తి,విశాలభారతి:** మహిళా శిశు సంక్షేమ శాఖలోని జిల్లా మహిళా సాధికారిక కేంద్రం వారు భేటీ బచావో బేటి పడావో పథకం పైన తాడిపత్రి గ్రామం గోపాల్పేట మండలంలో అవగాహన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మిషన్ కోఆర్డినేటర్ ఎస్ భాస్కర్ మాట్లాడుతూ .... బాలికల చదువు కుటుంబానికి దేశానికి అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తుందని చెప్పడం జరిగింది. తల్లిదండ్రులు ఆడమగ అనే తేడా లేకుండా ఇద్దరినీ సమానంగా పెంచాలి అని అమ్మాయిలకు ప్రభుత్వం మంచి పథకాల ద్వారా విద్య, ఆరోగ్యం, వసతి సౌకర్యం కల్పించి వారు ఉన్నత శిఖరాలకు అధిరోహించడానికి వారికి అవకాశాలు ఇస్తుంది. పిల్లలకు చిన్న వయసులోనే వివాహం చేయడం వల్ల శారీరక మానసిక సమస్యలు వస్తాయని 18 సంవత్సరాలు నిండిన తర్వాత అని వారికి వివాహం చేయాలని చెప్పడం జరిగింది. అలాగే ఈ మధ్యకాలంలో చిన్నపిల్లల పైన లైంగిక వేధింపులు దాడులు ఎక్కువగా జరుగుతున్నాయి కాబట్టి మన పిల్లలకు సురక్షితమైన స్పర్శ సురక్షితం కానీ స్పర్శల గురించి వారికి తెలియజేయాలి. ఎవరైనా వ్యక్తులు మన పిల్లల పట్ల అసౌకర్యంగా ప్రవర్తించిన ఎడల మన పిల్లలకు మనం బాసటగా నిలిచి ఆ వ్యక్తులకు శిక్ష పడే విధంగా చూడాలి. పిల్లలు చదువుకుంటున్నారని వారికి మనము మొబైల్ ఇస్తున్నాము అందులో వారు ఏమి చూస్తున్నారని నియంత్రణ బాధ్యత కూడా తల్లిదండ్రులది. పిల్లలకి సమాజంలో గొప్ప స్థానాలను అధిరోహించిన వారి యొక్క జీవిత చరిత్రలను ఎప్పటికప్పుడు మనము గుర్తు చేస్తూ ఉండాలి దాని ద్వారా వారిలో ఆత్మస్థైర్యం పెరిగి లక్ష్యం దిశగా వెళ్లడానికి అవకాశం ఏర్పడుతుంది దీనిలో కూడా తల్లిదండ్రుల పాత్ర ఎంతో ముఖ్యమైనది అని చెప్పడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో డిస్టిక్ మిషన్ కోఆర్డినేటర్ ఎస్ భాస్కర్, జండర్ స్పెషలిస్ట్, శ్రీ వాణి, సలోమి, స్పెషలిస్ట్ ఇన్ ఫైనల్ లిటరేస్, సుమ, ఫీల్డ్ అసిస్టెంట్ , గ్రామంలోని మహిళలు గ్రామ పెద్దలు పాల్గొనడం జరిగింది.

## చేపలు పట్టడానికి వెళ్లి యువకుడు మృతి



**ఆర్మూర్ ,విశాలభారతి:** నందిపేట్ మండలంలోని ఐలాపూర్ గ్రామానికి చెందిన గుండ్ల సురకత్తుల హరీష్ (24)శనివారం కోట్లకుంట చెరువులోకి చేపలు పట్టడానికి వెళ్లాడు చేపలు పట్టే క్రమంలో ప్రమాదవశాత్తు వలచుట్టుకొని మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు .

## బిజెపి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి

- ఇప్పుడు ఒక మాట తర్వాత ఒక మాట
- మాదిగల ఓటుతోని బిజెపికి బుద్ధి చెప్తాం
- అంబేద్కర్ సంఘం రాష్ట్ర కార్యదర్శి చెప్యాల ప్రకాష్

**భీమదేవరపల్లి, విశాలభారతి:** 10 సంవత్సరాలు అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ఏర్పడ్డాక ఒక మాట తర్వాత ఒక మాట మాట్లాడుతుందని ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెప్యాల ప్రకాష్ అన్నారు శనివారం మండలంలోని విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 100 రోజుల్లో వర్గీకరణ చేస్తున్న బీజేపీ ప్రభుత్వం ఇప్పటి వరకు వర్గీకరణ చేయకపోవడం వెనక అంతర్యమేంటో దేశ దళిత సమాజానికి చెప్పాల్సిన అవసరం నరేంద్ర మోడీకి ఉందని అన్నారు 30 సంవత్సరాలు దళిత జాతి కోసం సుదీర్ఘ పోరాటాలు జరుగుతుంటే ఎంఆర్పిఎస్ ఉద్యమాలు చేస్తున్న సమయంలో దేశ మాదిగల ఓట్ల కోసమే ప్రధాని నరేంద్ర మోడీ వర్గీకరణ అంశం వెతుకునట్లుగా కనిపిస్తుందని గత నాలుగు నెలల కిందట హైదరాబాదులో జరిగిన మాదిగల విశ్వరూప మహాసభకు ప్రధాన మంత్రి మోడీ హాజరై లక్షల మంది మాదేల ముందు వర్గీకరణ అంశంపై మాట ఇచ్చి నెలలు గరుస్తున్న వర్గీకరణ చేయకపోవడం పట్ల మాదిగ జాతి ఆగ్రహానికి గురవుతున్నారని వ్యక్తం చేశారు మాదిగలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోకపోతే రాబై ఎలక్షన్లో మాదిగలు బిజెపికి ఓటుతో బుద్ధి చెప్తామన్నారు కార్యక్రమంలో కండ సుధాకర్ కొమ్ముల రవీందర్ అంబాల చక్రపాణి రవి మాడుగుల యాదగిరి బెజ్జంకి సారయ్య రామస్వామి తదితరులు పాల్గొన్నారు



## రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం



**బాల్కొండ,విశాలభారతి:** బాల్కొండ నియోజకవర్గం భీమ్‌గల్ మండలంలోని సికింద్రపూర్ గ్రామంలో మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు అందించినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పాలాభిషేకం చేశారు.ఈ సందర్భంగా జలం గౌడ్ మాట్లాడుతూ...కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 6 గ్యారంటీల స్కీం పథకంలో భాగంగా మహిళలకు వడ్డీ లేని రుణాలు మాఫీ, ఇల్లు లేని వారికి ఐదు లక్షల గృహ పథకం,ఎస్సీ,ఎస్టీ లకు 6 లక్షలు అందించడం జరుగుతుందని తెలిపారు.మహిళా సంఘాలకు గత ప్రభుత్వం ఏమి చేయలేదని,కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలందరికీ పెద్ద పీట వేస్తుందని చెప్పారు.అదేవిధంగా కాంగ్రెస్ నాయకులు చిన్నారెడ్డి మాట్లాడుతు...కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారా మహిళలకు అన్ని రకాల ఉపాధి కల్పిస్తుంది అన్నారు. మహిళలు మాట్లాడుతూ... మాకు వడ్డీ లేని రుణాలు ఇచ్చినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జలం గౌడ్,చిన్నారెడ్డి ,బక్కన్న,కాంగ్రెస్ నాయకులు,ఐకెపి సీనియర్ సిసి పురస్తు నరేష్,వివో ఏ రత్నాకర్ గౌడ్,సుమారు 300 మంది మహిళలు పాల్గొన్నారు.

## నిర్వాహకుల నిర్లక్ష్యం..

### డాక్టర్ లెటర్ ప్యాడు లేకుండానే వైద్యం



**వనపర్తి విశాలభారతి:** అర్హత కలిగిన డాక్టర్ లెటర్ ప్యాడ్ లేకుండానే మహాలక్ష్మి క్లినిక్ గా నిర్వాహకులు యదేచ్చగా గత రెండేళ్లుగా క్లీనింగ్ నడిపిస్తుండడం ఆ క్లినిక్ సైతం జిల్లా కేంద్రంలో కొనసాగడం అధికారుల పనితీరుకు అద్దం పడుతుందని పలువురు నోటిపై వేలేసుకున్నారు. డాక్టర్లను అడ్డం పెట్టుకొని వారు చేస్తున్న క్లినిక్ నిర్వహణ మూడు పువ్వులు ఆరు కాయలు అన్న చందంగా నడుస్తోంది. కాసుల వారికి పరమాణువుదిగా బాధితులను సైతం ముక్కు పిండి పైసలు వసూలు చేస్తున్నారు. ఇలాంటి ఆరోపణలు ఎన్నో సార్లు వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు వినతుల రూపంలో సమర్పించినప్పటికీ వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఒక్క అడుగు ముందుకు వేశారు. శనివారం వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఆకస్మిక తనిఖీ చేసి మహాలక్ష్మి క్లినిక్ సెంటర్ ను తాత్కాలికంగా సీజ్ చేసినట్లు డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ శ్రీనివాసులు వెల్లడించారు. ఈ క్లినిక్ లో డాక్టర్లు ఎప్పుడు వస్తారో... ఎక్కడ ఉంటారో తెలియదు వారు వచ్చేంతవరకు టోకెన్ తీసుకొని క్యూలో ఉండాల్సిందే... అత్యవసరమైతే ప్రాణాలకే ప్రమాదమని తెలిసిన వారు డాక్టర్ సర్జరీ లో ఉన్నాడు, ఇప్పుడు వస్తాడు అప్పుడు వస్తాడు అంటూ కాలయాపన చేస్తుంటారు. ఏది ఏమైనప్పటికీ మహాలక్ష్మి క్లినిక్ నిర్వాహకులు లాభర్జన గా ధ్యేయంగా వ్యవహరించడం బాధితులు, వారి సహాయకులు అవాక్కవుతున్నారు. మహాలక్ష్మి క్లినిక్ నిర్వాహకులొకరు ప్రభుత్వ ఉద్యోగిగా ఉండడం కొసమెరుపు.


## బీఆర్ఎస్ పార్టీ నుండి భారీగా కాంగ్రెస్ లోకి చేరికలు

**బాల్కొండ,విశాలభారతి:** భీమ్‌గల్ మండలం పల్లికొండ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు 50 మంది బాల్కొండ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధిలో భాగస్వామ్యం కావడానికి,ముత్యాల సునీల్ కుమార్ ఆధ్వర్యంలో పనిచేయుటకు మేమంత కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు చేరినవారు తెలిపారు.చేరిన వారిలో అశోక్, చందు, రాజేశ్వర్,బద్రి,నవీన్ తదితరులు ఉన్నారు. భీమ్‌గల్ మండలం బడాభీంగల్ ఎంజీ తాండకి చెందిన మాజీ సర్పంచ్ రమేష్ ముత్యాల సునీల్ కుమార్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆయనతో పాటు నర్సయ్య,నరేష్,జీవన్, శ్రీనివాస్ తదితరులు చేరారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొదిరే స్వామి,జె జె నర్సయ్య, కుంట రమేష్, అనంతరావ్,కిరణ్,రాజేష్ కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.


## గని ప్రమాదంలో కార్మికుడు మృతి



**మంచిర్యాల, విశాల భారతి :** మందమర్రి సింగరేణి ఏరియా స్పోర్ట్స్ లో క్రేన్ యంత్రాలతో ఇనుప రేకులు లారీలు లోడ్ చేస్తుండగా చైన్ తెగి కార్మికులపై డబ్ల్యూ స్టాప్ రేకులు పడి ఈరోజు ఉదయం కాజీపేట టు గని కార్మికుడు కర్రె రాజు జనరల్ మజ్దూర్ 40 సంవత్సరాలు ప్రమాదం జరిగి సీరియస్ గా ఉన్నటువంటి రాజును వెంటనే రామకృష్ణాపూర్ ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కార్మికుడు మృతి చెందినాడు ఇట్టి ప్రమాదానికి బాధ్యులైన స్పోర్ట్స్ ఇంజనీర్లు కాసిపేట టు గని మేనేజర్ను ప్రమాదానికి బాధ్యులైన రక్షణ చర్యలు విస్మరిస్తున్న అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని సింగరేణి కాలరీస్ లేబర్ యూనియన్ టి ఎన్ టి యు సి ప్రధాన కార్యదర్శి టి మణి రామ్ సింగ్ డిమాండ్ చేశారు అలాగే సింగరేణి యాజమాన్యానికి ఉత్పత్తి పై ఉన్న ప్రేమ కార్మికుల యొక్క రక్షణ పై లేదని వెంటనే ఈ ప్రమాదంపై డీజీఎంఎస్ తో విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కర్రి రాజు అనే జనరల్ కు రెండు కోట్ల నష్టపరిహారం చెల్లించాలని అతనికి మైండ్ యాక్సిడెంట్ క్రింద ట్రీట్ చేయాలని కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలి భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు పునరావృత్తం కాకుండా చర్యల కొరకు అంతర్జాతీయ ప్రమాణాలు కొనసాగించాలని టిఎన్టియుసి నాయకులు గద్దెల నారాయణ ఉపాధ్యక్షులు వెంకటస్వామి మందమరి ఏరియా అధ్యక్షులు డి చంద్రమౌళి బెల్లంపల్లి ఏరియా అధ్యక్షులు ఓ జీవరత్నం జిల్లా నాయకులు ఎం నరసింహ జి రఘుపతి కొంచెం భూపతి ఉపాధ్యక్షులు బొల్లు మల్లయ్య యజమాన్యానికి డిమాండ్ చేశారు



**పర్వతగిరి మండలం అన్నారం గ్రామ ఉమ్మగాని రవీందర్ ఫంక్షన్ హాల్లో జమస్తాపురం గ్రామ మాజీ ఉప సర్పంచ్ జక్కుల సోమయ్య మనెమ్మ దంపతుల కుమార్తె రమ్య వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన తొర్రూర్ పిఏసిఎస్ చైర్మన్ వరంగల్ డిసిసిబి బ్యాంక్ డైరెక్టర్ కాకిరాల హరి ప్రసాద్ రావు తదితరులు.**

## గురుకుల విద్య ఒక కొత్త ఒరవడిని సృష్టించింది



**బెల్లంపల్లి, విశాలభారతి:** బెల్లంపల్లి సిఓఈ తమదైన స్వయం క్రమశిక్షణ, ప్రత్యేక ప్రణాళికతో డాక్టర్లు, ఐఐటి,ఎన్ ఐటి లే కాకుండా విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చి దిద్దుతూ గురుకుల విద్యలో ఒక కొత్త ఒరవడిని సృష్టించిందని బెల్లంపల్లి ఆర్డీఓ పోరిక హరికృష్ణ అన్నారు. తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల సెటర్ ఆఫ్ ఎక్స్ లెన్సీ(సిఓఈ),బెల్లంపల్లి లో జరిగిన వార్షికోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యతిదిగా హాజరయ్యారు.ప్రిన్సిపాల్ ఐనాల సైదులు అద్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆర్డీఓ పోరిక హరికృష్ణ విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యంతో ముందుకుపోవాలన్నారు.టీచర్లు చెప్పిన పాఠ్యాంశాలను శ్రద్దగా అర్థంచేసుకుంటూ చదివి మననం చేసుకుంటే పరీక్షలను అనుకున్నంత స్థాయిలో రాయవచ్చునన్నారు.ఇంటర్ విద్యార్థులు ఐఐటి,నీట్ ప్రత్యేక శిక్షణ తోపాటు ఇతర పోటీ పరీక్షలకు ప్రణాళికతో చదివితే ఉన్నతవిద్యావకాశాలు పొందవచ్చునన్నారు.బెల్లంపల్లి సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్సీ విజయాలను ఎన్నో విద్యాసంస్థలు ఆదర్శంగా తీసుకునే స్థాయిలో ఎదగడం బెల్లంపల్లికే గర్వంగా ఉందన్నారు.



విశాల భారతి
తెలుగు దిన పత్రిక
సినిమా
www.vishalabharati.com
epaper:vishalabharati.com
9
ఆదివారం,
17.03.2024
హైదరాబాద్
vishalabharathi Telugu Daily



## నెల కాకముందే ఓటీటీలోకి రాబోతున్న తెలుగు కామెడీ థ్రిల్లర్



టాలీవుడ్ యువ నటుడు శివ కందుకూరి ప్రధాన పాత్రలో నటించిన తాజా చిత్రం 'భూతద్ధం భాస్కర్ నారాయణ' ఈ సినిమాకు పురుషోత్తం రాజ్ దర్శకత్వం వహించగా రాశి సింగ్ కథానాయికగా నటించింది. స్నేహాల్, శశిధర్, కార్తీక్ సంయుక్తంగా నిర్మించారు. కామెడీ థ్రిల్లర్‌గా వచ్చిన ఈ చిత్రం మార్చి 1న థియేటర్లలోకి వచ్చి ప్రేక్షకులని అలరించింది. అయితే ఈ సినిమా విడుదలై నెల రోజులు కూడా కాకముందే ఓటీటీ లాక్ చేసుకుంది. టాలీవుడ్ యువ నటుడు శివ కందుకూరి ప్రధాన పాత్రలో నటించిన తాజా చిత్రం 'భూతద్ధం భాస్కర్ నారాయణ' ఈ సినిమాకు పురుషోత్తం రాజ్ దర్శకత్వం వహించగా రాశి సింగ్ కథానాయికగా నటించింది. స్నేహాల్, శశిధర్, కార్తీక్ సంయుక్తంగా నిర్మించారు. కామెడీ థ్రిల్లర్‌గా వచ్చిన ఈ చిత్రం మార్చి 1న థియేటర్లలోకి వచ్చి ప్రేక్షకులని అలరించింది. అయితే ఈ సినిమా విడుదలై నెల రోజులు కూడా కాకముందే ఓటీటీ లాక్ చేసుకుంది.




## షూటింగ్ కంప్లీట్ చేసుకున్న విజయ్ దేవరకొండ ఫ్యామిలీ స్టార్

రౌడీ హీరో విజయ్ దేవరకొండ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'ఫ్యామిలీ స్టార్' (Family Star). గీతగోవిందం సినిమాతో బాక్సాఫీస్‌ను షేక్ చేసిన పరశురాం (Parasuram) ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తుండగా.. మృణాళ్ ఠాకూర్ ఈ సినిమాలో హీరోయిన్‌గా నటిస్తుంది. ఈ సినిమా ఏప్రిల్ 05న ప్రేక్షకుల ముందుకు రానున్న విషయం తెలిసిందే. ఇక విడుదల తేదీ దగ్గరపడుతుండటంతో చిత్రయూనిట్ ప్రమోషన్స్ షూరు చేసింది. ఇప్పటికే ఈ సినిమా నుంచి గ్లింప్స్‌తో పాటు టీజర్ విడుదల చేయగా మంచి రెస్పాన్స్ దక్కించుకుంది. ఇదిలావుంటే తాజాగా మూవీ నుంచి మేకర్స్ సాలిడ్ అప్‌డేట్ ఇచ్చారు. ఈ మూవీ షూటింగ్ పూర్తయినట్లు విజయ్ దేవరకొండ తాజాగా సోషల్ మీడియా వేదికగా ప్రకటించాడు. దీనితో పాటు ఒక షార్ట్ వీడియో కూడా పంచుకున్నాడు. ఇక ఈ సినిమాలో కుటుంబ బాగోగులు చూసుకునే ఫ్యామిలీ మ్యాన్‌గా, బయట రౌడీల బెండు తీసే పవర్‌ఫుల్ మ్యాన్‌గా విజయ్ దేవకొండ ఇందులో కనిపించనున్నారు. కూల్ ఫ్యామిలీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ప్రేక్షకులను అలరించనున్న ఈ చిత్రానికి గోపీ సుందర్ సంగీతం అందిస్తున్నాడు. శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్ రాజు, శిరీష్ నిర్మిస్తుండగా.. ఎస్‌వీసీ బ్యానర్‌లో వస్తున్న 54వ చిత్రమిది.

## పూర్వ వైభవం కోసం పూజాహెగ్డే.. రెండు భారీ ప్రాజెక్ట్ లలో కథానాయికగా!

అగ్ర కథానాయిక పూజాహెగ్డేకు గత రెండేళ్లుగా అంతగా కలిసి రావడం లేదు. తెలుగులో 'అల వైకుంఠపురములో' తర్వాత ఒక్క విజయాన్ని దక్కించుకోలేకపోయింది. కెరీర్ వరుస వైఫల్యాలతో కొనసాగుతున్నా ఏ మాత్రం ఆత్మవిశ్వాసాన్ని కోల్పోకుండా తిరిగి పూర్వ వైభవాన్ని సాధిస్తాననే ధీమాతో ఉంది పూజాహెగ్డే. తాజా సమాచారం ప్రకారం ఈ భామ రెండు భారీ ప్రాజెక్ట్‌లలో భాగం కానున్నట్లు తెలిసింది. 'పుష్ప-2' చిత్రం తర్వాత అట్లీ దర్శకత్వంలో అల్లు అర్జున్ ఓ సినిమా చేయబోతున్నారని వార్తలొస్తున్నాయి. బన్నీకి కథ చెప్పానని, ఇద్దరి మధ్య చర్చలు జరుగుతున్నాయని అట్లీ ఓ సందర్భంలో తెలిపారు. ఈ సినిమాలో పూజాహెగ్డే కథానాయికగా నటించనుందని తమిళ మీడియాలో వార్తలొస్తున్నాయి. ఇక మరో సినిమా విషయానికొస్తే... నందినీ రెడ్డి దర్శకత్వంలో సిద్ధూ జొన్నలగడ్డ హీరోగా ఓ సినిమా తెరకెక్కనుంది. తొలుత ఇందులో సమంతను నాయికగా అనుకున్నారట. అయితే ప్రస్తుతం ఆమె సినిమాలకు బ్రేక్ తీసుకోవడంతో ఆమె స్థానంలో పూజాహెగ్డేను కథానాయికగా ఎంపిక చేసే ఛాన్స్ ఉందని అంటున్నారు. ఒకవేళ ఈ రెండు సినిమాల్లో పూజాహెగ్డే నాయికగా ఖరారైతే కెరీర్ తిరిగి పుంజుకుంటుందని ఆమె అభిమానులు ఆశిస్తున్నారు.




## పవన్ కళ్యాణ్ ఓజీ నుంచి కొత్త పోస్టర్ రిలీజ్ చేసిన తమన్

టాలీవుడ్ హీరో పవన్ కళ్యాణ్ (Pawan Kalyan) నటిస్తోన్న తాజా చిత్రం 'ఓజీ' (ఒరిజినల్ గ్యాంగ్‌స్టర్). 'సాహో' (Saaho) ఫేం సుజీత్ (Sujeeth) దర్శకత్వంలో వస్తున్న ఈ చిత్రం సెప్టెంబర్ 27న ప్రేక్షకుల ముందుకురానుంది. జపాన్ బ్యాక్‌డ్రాప్‌లో గ్యాంగ్‌స్టర్ కథాంశంతో ఈ సినిమా సిద్ధమవుతుండగా.. ప్రస్తుతం ఎన్నికల సందర్భంగా మూవీ షూటింగ్ కొన్ని రోజులు వాయిదా పడింది. అయితే ఈ సినిమా నుంచి ఇప్పటికే ఫస్ట్ లుక్‌తో పాటు గ్లింప్స్ విడుదల చేయగా అభిమానులను అలరించిన విషయం తెలిసిందే. తాజాగా ఈ మూవీ నుంచి సంగీత దర్శకుడు తమన్ కొత్త పోస్టర్‌ను పంచుకున్నాడు. ఇక ఈ పోస్టర్‌లో కత్తి పట్టుకుని ప్రత్యర్థులను తెగనరుకుతున్నట్లు పవన్ కనిపిస్తున్నాడు. ఇందులో పవన్ లుక్ చాలా పవర్ ఫుల్‌గా ఉంది. ఇక యాక్షన్ థ్రిల్లర్ నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ సినిమాలో పవన్‌కు జోడీగా ప్రియాంక అరుళ్ మోహన్ నటిస్తుంది. అర్జున్ దాస్, శ్రియా రెడ్డిలు కీలకపాత్రలు పోషిస్తున్నారు. బాలీవుడ్ నటుడు ఇమ్రాన్ హష్మీ ప్రతినాయకుడిగా కనిపించనున్నాడు. మరోవైపు, పవన్.. క్రిష్ దర్శకత్వంలో 'హరిహర వీరమల్లు', హరీశ్ శంకర్ దర్శకత్వంలో 'ఉస్తాద్ భగత్‌సింగ్' చిత్రాల్లో నటిస్తున్నారు.

## ఘనంగా వెంకటేశ్ రెండో కూతురి పెళ్లి..

### ఫొటోలు వైరల్

టాలీవుడ్ సీనియర్ నటుడు దగ్గుబాటి వెంకటేష్ రెండో కుమార్తె హవ్యవాహిని (Havyavahini) వివాహం శుక్రవారం హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. విజయవాడకు చెందిన డాక్టర్ పాతూరి వెంకటరామారావు కుమారుడు డాక్టర్ నిషాంత్ (Nishanth)తో కలిసి హవ్యవాహిని ఏడడుగులు వేసింది. రామానాయుడు స్టూడియోస్‌లో ఈ వివాహ వేడుక జరుగగా.. ఇరు కుటుంబసభ్యులు, సన్నిహితుల సమక్షంలో ఈ వేడుక జరిగింది. కాగా ప్రస్తుతం దీనికి సంబంధించిన వీడియోలు, ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. గతేడాది అక్టోబర్‌లో హవ్యవాహిని నిశ్చితార్థం జరిగిన విషయం తెలిసిందే. ఈ వేడుకకు మెగాస్టార్ చిరంజీవి, సూపర్‌స్టార్ మహేశ్‌బాబు, నాగ చైతన్య, దగ్గుబాటి రానా, సహా పలువురు రాజకీయ సినీ ప్రముఖులు హాజరై కొత్త జంటను ఆశీర్వదించారు. వెంకటేష్‌కు నలుగురు సంతానం. అందులో ముగ్గురు అమ్మాయిలు. చివరిగా కుమారుడు అర్జున్ జన్మించాడు. పెద్ద కుమార్తె ఆశ్రిత వివాహం నాలుగేళ్ల క్రితం 2019లో జరిగింది. ప్రస్తుతం ఆమె విదేశాల్లో ఉంటూ ఇన్ఫినిటీ ప్లాటర్ (Infinity Platter) అనే ఫుడ్‌కి సంబంధించిన యూట్యూబ్ ఛానల్ నడుపుతుంది.





## సవాల్‌గా తీసుకొని చేశాను

'ఓ గొప్ప చరిత్రకు తెరరూపం 'రజాకార్'. అలాంటి సినిమాలో నాకూ స్థానం దొరకడం, నా పాత్రకు మంచి స్పందన రావడం చాలా ఆనందంగా ఉంది' అంటున్నది నటి అనుశ్రీ. యాట సత్యనారాయణ దర్శకత్వంలో గూడూరు నారాయణరెడ్డి నిర్మించిన 'రజాకార్' చిత్రంలో కీలకపాత్ర పోషించింది అనుశ్రీ. ఈ సినిమాలోని తన పాత్రకు వస్తున్న స్పందనపై ఆనందాన్ని వ్యక్తంచేస్తూ విలేకరులతో ముచ్చటించింది అనుశ్రీ. 'మాది బెంగళూరు. అక్కడే చదివాను. థియేటర్స్ ఆర్టిస్టుని. మోడలింగ్ కూడా చేశాను. 2018లో చత్తీస్‌ఘఢ్ నుంచి మిస్ ఇండియా పోటీల్లో పాల్గొన్నాను. నాన్నకేమో నాతో సివిల్స్ చేయించాలని కోరిక. నాకేమో నటన అంటే ప్రాణం.అందుకే హైదరాబాద్ వచ్చేశాను. ఇక్కడే థియేటర్స్ వర్క్‌షాప్ చేశాను. దర్శకుడు యాటాగారు నిజాం భార్య పాత్ర కోసం వెతుకుతున్నారని తెలిసి వెళ్లి సంప్రదించాను. మకరంద్ దేశ్‌పాండే గారితో లుక్‌టెస్ట్ చేసి ఓకే అనుకున్న తర్వాతనే నన్ను ఎంపిక చేశారు. అలా నన్ను ఆ పాత్ర వరించింది. చాలా సున్నితమైన పాత్ర అది. వాస్తవ పరిస్థితులు నిజాంకు తెలిపే పాత్ర. అందుకే సవాల్‌గా తీసుకొని చేశాను. ఈ పాత్రకోసం మూడు నెలలు మెథడ్ యాక్టింగ్‌లో ట్రైనింగ్ కూడా తీసుకున్నాను. బాబీసింహా, రాజ్ అర్జున్, మకరంద్‌దేశ్‌పాండే లాంటి గొప్ప నటులతో స్క్రీన్ షేర్ చేసుకునే అవకాశం రావడం నా అదృష్టం. భవిష్యత్తులో మంచి పాత్రలు పోషించాలని ఉంది' అంటూ చెప్పకొచ్చింది అనుశ్రీ.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No - APTEL/2010/32877.